ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 11 సెప్టెంబరు 2024

ప్రభుత్వం మారినా...

- మద్యం షాపుల్లో నగదుతోనే అమ్మకాలు
- డిజిటల్ పేమెంట్లకు ససేమిరా...
- కొన్ని బ్రాండ్ల మద్యం షాపుల నుంచి బార్లకు తరలింపు...
- నెట్‌వర్క్ పనిచేయలేదని దబాయింపు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మాదిరే కూటమి ప్రభుత్వంలోనూ మద్యం దుకాణాల్లో అక్రమాలు ఆగడం లేదు. మద్యం కొనుగోలుదారుల నుంచి నగదు లావాదేవీలు కొనసాగుతూనే ఉన్నాయి. ఫోన్‌పే, గూగుల్‌పే వంటి డిజిటల్ లావాదేవీలు జరపడం లేదు. దీనివల్ల మద్యం దుకాణాల్లో పనిచేసే కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నెట్‌వర్క్ ప్రాబ్లమ్ పేరుతో నగదునే తీసుకుంటున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా డబ్బు తీసుకోకుండా ఎంఆర్‌పీకే షాపుల్లోని కొన్ని బ్రాండ్ల మద్యాన్ని బార్లకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీనివల్ల బార్ల యజమానులకు ఆదాయం వస్తుండగా మందుబాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో మద్యం విధానం భ్రష్టు పట్టింది. గతంలో టెండర్ల ద్వారా మద్యం దుకాణాలను కేటాయించేవాళ్లు. టెండర్లు దక్కించుకున్న వ్యక్తులు మద్యం అమ్మకాలు చేసేవాళ్లు. అయితే ఈ విధానంలో అక్రమాలు జరుగుతున్నాయనే కారణంతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి మద్యం పాలసీని మార్చారు. దీంతో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించి అమ్మకాలు చేపట్టింది. ఈ అమ్మకాలు చేపట్టేందుకు తమ సొంత మనుషులను నియమించుకున్నారు. ఈ దుకాణాల్లో గతంలో ఉన్న ముఖ్యమైన బ్రాండ్లు ఏవీ అందుబాటులో లేవు. అప్పటి అధికార పార్టీ ముఖ్యనాయకులకు చెందిన డిస్టిలరీలలో తయారు చేసిన బ్రాండ్లనే అందుబాటులో పెట్టారు. ఇది చాలదన్నట్లు మద్యం కొనుగోలు దారుల నుంచి నగదు లావాదేవీలు నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనంతగా వైసీపీ ప్రభుత్వం మద్యం ధరలు పెంచింది. కనీసం పానీపూరి బండి వద్ద సైతం ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా డిజిటల్ లావాదేవీలు నిర్వహించే ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మద్యం దుకాణాల్లో నగదు లావాదేవీలు నిర్వహించడం విశేషం. ఇలా ఎక్కువ ధరలకు అమ్మిన మొత్తం అధికార పార్టీ నాయకుల జేబుల్లోకి వెళ్లిందని ప్రతిపక్షాలు అప్పట్లో తీవ్ర ఆరోపణలు చేశాయి. అయినా అప్పట్లో వైసీపీ నాయకులు వెనక్కి తగ్గలేదు. ఎవరేమనుకుంటే మాకేం అనే రీతిలో నాలుగు సంవత్సరాల పాటు గతంలో ఉన్న బ్రాండ్లు లేకుండానే స్థానిక బ్రాండ్ల మద్యాన్నే అమ్మేశారు. ప్రభుత్వం మారినా మద్యం దుకాణాల్లో అక్రమాలు ఆగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ ముఖ్యమైన పట్టణాలలో నగదు ద్వారానే అమ్మకాలు చేస్తున్నారు.

బార్లకు మేలు చేసేందుకు...

ప్రస్తుతం జిల్లాలో అర్బన్, రూరల్ ప్రాంతాలలో కలిపి 92 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తోంది. కడప మద్యం డిపో ద్వారా రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు మద్యం సరఫరా అవుతోంది. మదనపల్లె మద్యం డిపో ద్వారా తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలకు మద్యం సరఫరా అవుతోంది. అదేవిధంగా జిల్లాలో 11 ప్రభుత్వ లైసెన్సు కలిగిన బార్లు ఉన్నాయి. ప్రస్తుతం నగదు తీసుకుని మద్యం అమ్మకాలు చేయడం ద్వారా బార్లకు ఆదాయం వస్తోందని, తమ జేబులకు చిల్లు పడుతోందని మందుబాబులు వాపోతున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం రాత్రి 8 గంటలకు మద్యం దుకాణాన్ని మూసివేయాలి. దీంతో రాత్రి 8 తర్వాత బార్లలో మద్యం అమ్మకాల జోరు ఎక్కువగా ఉంటుంది. ఈ బార్లలో మద్యం ప్రియులు కోరుకున్న బ్రాండ్లు ఎక్కువగా ఉండవు. కాబట్టే పలువురు బార్ల యజమానులు మద్యం దుకాణాల్లో పనిచేసే వాళ్లతో కుమ్మక్కై అక్కడి నుంచి తమకు కావాల్సినంత మద్యం తెచ్చుకుంటున్నట్లు తెలిసింది. సాధారణంగా అప్పుడప్పుడు ఫోన్లలో నెట్‌వర్క్ ప్రాబ్లం వస్తూ ఉంటుంది. దీంతో ఫోన్‌పే, గూగుల్‌పేతో పాటు నగదు కూడా తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం ఇచ్చింది. ఈ వెసులుబాటునే కొందరు అక్రమాలకు వాడుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు చేసిన ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసే ఇవ్వాలి. ఫోన్‌పే చేస్తే డబ్బు సరాసరి ప్రభుత్వ అకౌంటులోకి వెళుతుంది. అదే నగదు తీసుకుని మందుబాటిల్‌ను స్కాన్ చేసినా ఎంఆర్‌పీ కంటే ఎంతో కొంత పెట్టుకుని బార్లకు అమ్ముకోవచ్చు. మద్యం దుకాణంలో ఎంఆర్‌పీకి లభించిన మద్యం బాటిల్ బార్‌లో కనీసం రూ.100 ఎక్కువ పెట్టి కొనాలి. ఈ విధంగా బార్లకు ఆదాయం ఉంటుంది. మద్యం దుకాణాలు మూసివేసిన తర్వాత బార్లలో వ్యాపారం జోరుగా జరుగుతోందని మందుబాబులు పేర్కొంటున్నారు. కొన్ని మద్యం షాపుల్లో సరుకు అందుబాటులో ఉన్నా లేవని చెబుతారని, షాపు మూయడానికి ముందు బార్లకు అమ్ముకుంటారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

రాయచోటి పట్టణంలో 8 మద్యం దుకాణాలు ఉన్నాయి. అధికారుల రికార్డుల ప్రకారం మూడు బార్లు ఉన్నాయి. అయితే రెండు మాత్రమే నడుస్తున్నాయి. సిండికేట్‌గా ఏర్పడి ఇంకో షాపు నడపకపోయినా నడుపుతునట్లు రికార్డులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ దాదాపు అన్ని మద్యం దుకాణాల్లోనూ నగదు తీసుకునే అమ్మకాలు చేస్తున్నారు. షాపు బయట మాత్రం నగదు, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా లావాదేవీలు జరపవచ్చనే బోర్డులు దర్శనమిస్తుంటాయి. మదనపల్లె పట్టణంలో నాలుగు బార్లు ఉన్నాయి. పట్టణంలో 12 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ కూడా ఎక్కువగా నగదు తీసుకునే మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. రాజంపేట పట్టణంలో 2 బార్లు ఉన్నాయి ఇక్కడ 8 దుకాణాలు ఉన్నాయి. నగదు, ఫోన్‌పే ద్వారా డబ్బు తీసుకుని అమ్మకాలు చేస్తున్నారు. పీలేరు పట్టణంలో రెండు బార్లు ఉన్నాయి. ఇక్కడ 5 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ కూడా ఫోన్‌పే, నగదు తీసుకుని అమ్మకాలు చేస్తున్నారు. రైల్వేకోడూరులో ఒక బారు ఉంది. 7 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ కూడా నగదు, ఫోన్‌పే ద్వారా లావాదేవీలు జరుపుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి మద్యంప్రియుల జేబులకు చిల్లులు పడకుండా చూడాలని పలువురు మద్యంప్రియులు కోరుతున్నారు.







రాయచోటిలోని ప్రభుత్వ మద్యం దుకాణం

జాతీయ పారా లీగ్ క్రికెట్‌లో శివకోటి ప్రతిభ


విన్నర్స్ ట్రోఫీతో క్రికెటర్ శివకోటి

నందలూరు, సెప్టెంబరు 10: కోయంబత్తూరులో ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి ఇండియన్ పారా క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో నందలూరుకు చెందిన యేల్చూరి శివకోటి పాల్గొని ప్రతిభ చాటాడు. ఈ సందర్భంగా శివకోటి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో మొత్తం 6 జట్లు పాల్గొన్నాయన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గెలాక్సీ జెయింట్స్, థండర్స్ మధ్య జరిగిన ఉత్కంఠ భరితమైన పోరులో 3 బంతులు మిగిలి ఉండగానే తమ జట్టు విజయం సాధించిందని తెలిపారు. తాను ఆడిన 4 మ్యాచ్‌ల్లో బౌలింగ్‌లో అద్భుతమైన ప్రతిభ కనరబరచానని అన్నారు. కీలకమైన సెమీఫైనల్ మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసి ఒక మేడిన్ ఓవర్‌తో పాటు 3 కీలకమైన వికెట్లు తీసి కేవలం 9 పరుగులు మాత్రమే ఇచ్చి జట్టును ఫైనల్‌కు చేర్చడంలో ప్రధాన భూమిక పోషించానని తెలిపారు. టోర్నమెంట్ మొత్తంలో 16 ఓవర్లు వేసి 7 వికెట్లు తీసి కేవలం 45 పరుగులు మాత్రమే ఇవ్వడం జరిగిందన్నారు. విజేతగా నిలిచిన మా జట్టు ఫ్రాంఛైజీ గెలాక్సీ జెయింట్స్ యజమాని అయిన రోటారాక్ట్ క్లబ్ ఆఫ్ కోయంబత్తూరు గెలాక్సీ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గెలుపొందిన మా జట్టుకు విన్నర్స్ ట్రోఫీతో పాటు మెడల్స్, గుర్తింపు పత్రాలు ఇచ్చారన్నారు. భవిష్యత్తులో మరిన్ని టోర్నమెంట్లలో పాల్గొని నందలూరు పేరు ప్రఖ్యాతులను, కీర్తి ప్రతిష్ఠలను దేశం నలుమూలలకు తెలియజేసే విధంగా ఉన్నత స్థాయికి చేరుకుంటానని తెలియజేశారు. దివ్యాంగుల ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ వసంత్‌కుమార్, గురుస్వామిరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

యథాస్థానాలకు ముగ్గురు ఎస్‌ఐలు

ములకలచెరువు, సెప్టెంబరు 10: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ముగ్గురు ఎస్‌ఐలను అటాచ్‌మెంట్ చేస్తూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేసినట్లు వచ్చిన వదంతులు పుకార్లుగా పోలీసులు చెబుతున్నారు. ములకలచెరువు ఎస్‌ఐ గాయత్రి, తంబళ్లపల్లె ఎస్‌ఐ లోకేశ్‌రెడ్డి, కురబలకోట మండలం ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌లను అటాచ్‌మెంట్ చేసినట్లు పెద్ద చర్చే జరిగింది. ఈ విషయం తంబళ్లపల్లె నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో ములకలచెరువు ఎస్‌ఐ గాయత్రి సోమవారం సాయంత్రం తిరిగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విధుల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఎస్‌ఐలను అటాచ్‌మెంట్ చేసినట్లు వచ్చినవి పుకార్లేనని పోలీసులు చెబుతున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు రాయచోటిలో అదనపు బాధ్యతలు నిర్వర్తించేందుకు ఎస్‌ఐ గాయత్రి వెళ్లగా, తంబళ్లపల్లె, ముదివేడు ఎస్‌ఐలు లోకేశ్‌రెడ్డి, దిలీప్‌కుమార్‌లు పీలేరులో వినాయక చవితి బందోబస్తు కోసం వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ గాయత్రి మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు రాయచోటి మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు విషయమై అక్కడ ఓ మహిళ స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు వెళ్లినట్లు తెలిపారు. దీనిపై కొందరు క్రమశిక్షణా చర్యలని అవాస్తవాలు ప్రచారాలు చేశారన్నారు. విధుల్లో భాగంగా వెళ్లి వచ్చాము తప్ప బదిలీలు చేయలేదని తెలిపారు.

వరద బాధితులకు రూ.25 లక్షల విలువైన సరుకులు

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


వరద బాధితులకు కిట్ల పంపిణీపై టీడీపీ నాయకులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 10: విజయవాడలో వరద బాధితులకు పంపిణీ చేసేందుకు రూ.25 లక్షల విలువైన సరుకులు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం తాను ఇచ్చిన పిలుపు మేరకు టీడీపీ నాయకులు, పుర ప్రముఖులు, మహిళా సంఘాలు, ప్రజలు అందరూ కలసి వారికి తోచిన విరాళాలు అందజేశారన్నారు. ఈ డబ్బుతో బియ్యం, రవ్వ, పసుపు, ధనియాలపొడి, మిరపపొడి, పామాయిల్, ఉప్పు, కందిపప్పు, గరంమసాలా వస్తువులను ఒక కిట్‌లా ప్యాకింగ్ చేశామన్నారు. మొత్తం 3 వేల కిట్లను వరద బాధితులను అందిస్తామన్నారు. వీటితో పాటు 300 గ్యాస్ స్టౌవ్‌లు, రెగ్యులేటర్లు, గ్యాస్‌పైప్‌లు పంపిణీ చేస్తామన్నారు. అవే కాకుండా ఎర్రగడ్డలు, తెల్లగడ్డలు, ఉల్లగడ్డలు, అల్లం, కూడా కిట్లులాగా ప్యాకింగ్ చేశామన్నారు. తాను బుధవారం ఉదయం విజయవాడ చేరుకుని ఎక్కడెక్కడ వరద బాధితులకు అవసరం ఉందో పరిశీలించి, గురువారం నుంచి 3 వేల మంది బాధితులకు ఈ కిట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. తనకు సహకరించిన టీడీపీ నాయకులు, ప్రజలు, మహిళా సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, కట్టా దొరస్వామినాయుడు, ఫణికర్ రెడ్డి, నాదెళ్ల శివన్న, బాలుస్వామి, షంషీర్, సహదేవనాయుడు, నవీన్‌చౌదరి, జేవీ రమణ, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి : కలెక్టర్


పెద్దమండ్యం అంగన్‌వాడీ కేంద్రం-1లో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

పెద్దమండ్యం, సెప్టెంబరు 10: అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఐసీడీసీ సీడీపీవో, అధికారులను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. పెద్దమండ్యం మండలంలో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. పెద్దమండ్యం అంగన్‌వాడీ కేంద్రం-1, ప్రభుత్వాసుపత్రి, గుడిసెవారిపల్లి ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా శాఖల్లో పలు రికార్డులను తనిఖీ చేసి, సిబ్బంది వివరాలు ఆరా తీశారు. గుడిసెవారిపల్లి గణేశ్ నిమజ్జనం అనంతరం చెరువులో ట్రాక్టర్ బోల్తా పడి 6వ తరగతి విద్యార్థి అఫ్జల్ మృతి చెందిన ప్రమాద సంఘటన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రమాదంలో మృతి, గాయపడిన బాధితుల వివరాలను తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ వివరించారు. గుడిసెవారిపల్లి చెరువు కట్ట అభివృద్ధి పనులకు నివేదిక ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులకు ప్రమాదాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని చెప్పారు.

పెద్దమండ్యం ప్రభుత్వాసుపత్రిలో ఓపీ రోగులు, సిబ్బంది విధుల వివరాలు రికార్డులలో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. విషజ్వరాలు వ్యాప్తిపై సకాలంలో సమాచారం ఇవ్వాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది సమాచారం ఇవ్వకుండా ఎక్కడికి వెళ్లకూడదని ఆదేశించారు. అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ముందుగా పెద్దమండ్యం అంగన్‌వాడీ కేంద్రం-1, పెద్దమండ్యం ప్రాథమిక తెలుగు పాఠశాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల్లో విద్యాప్రమాణాలు, సామర్థ్యం పెంచడానికి కేంద్రాలలో టీచింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు, చిన్నారి పిల్లల్లో విద్యా సామర్థ్యం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిన్నారులతో ముచ్చటించి వారికి చాక్లెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, అంగన్‌వాడీ సీడీపీవో నాగవేణి, వైద్యాధికారులు హరివర్మ, మహబూబ్‌బాషా, ఏపీవో మురళి, హౌసింగ్ ఏఈ సందీప్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నౌజియాబేగం, కళావతి తదితరులు పాల్గొన్నారు.

సన్నజాజి కేరాఫ్ వాల్మీకిపురం



- వందల ఎకరాల్లో సాగు
- వేలాది కుటుంబాలకు ఉపాధి

వాల్మీకిపురం, సెప్టెంబరు 10: మండు వేసవి..మార్చి నెల వచ్చిందంటే మండే ఎండలతో పాటు సువాసనలు వెదజల్లే సన్నజాజి, మల్లె పూల సీజన్ వచ్చేస్తుంది. మార్చి నెలలో సన్నజాజి, మల్లె పూల సీజన్ ప్రారంభమై నవంబరు నెలలో ముగుస్తుంది. వాల్మీకిపురం పరిసర ప్రాంతాలలో సుమారు వంద ఎకరాల్లో సన్నజాజి తోటలు విస్తరించి సువాసనలు వెదజల్లుతున్నాయి. ఎకరాకు 3500 కిలోల చొప్పున ప్రతిఏటా వాల్మీకిపురంలో సుమారు 400 టన్నులకు పైగా పూల దిగుబడి వస్తుండడం గమనార్హం. సన్నజాజిలు సగటున కిలో ధర రూ.300 నుంచి రూ.400 పలుకుతుండగా, పండుగ సీజన్ ముఖ్యంగా పెళ్లిళ్ల సమయంలో కిలో రూ.500 వరకు కూడా పలుకుతాయి. ప్రతిఏటా ఈ ప్రాంత రైతులు సన్నజాజి పూల అమ్మకాల ద్వారా సుమారు రూ.3 కోట్ల వరకు సంపాదిస్తున్నారు. అంతేకాక కమీషన్ ఏజెంట్లు, వ్యాపారస్తుల సంపాదన మరిన్ని రెట్లు అధికం. వాల్మీకిపురం పూల తోటల ద్వారా సుమారు 2500 మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. వీరు కిలో మొగ్గలు తీసేందుకు రూ.150 తీసుకుంటున్నారు. ఒక కూలీ రోజుకు 3 కిలోల నుంచి 4 కిలోల పూలను కోస్తారు. సన్నమొగ్గల సీజన్ ముగిసినా కూలీలకు మాత్రం ఏడాదంతా పనులు ఉంటాయి. నిత్యం తోపుడు బండ్లు, గంపల్లో పూలు పెట్టుకుని పరిసర పట్టణాల్లో, గ్రామాల్లో విక్రయిస్తూ మరో 500 మందికి పైగా ఉపాధి పొందుతుంటారు. అంతేకాక కూలికి ఇళ్లలో పూలు కట్టి ఇవ్వడం ద్వారా వాల్మీకిపురం, మదనపల్లెల్లో దాదాపుగా మరో 800 మందికి ఉపాధి దొరుకుతోంది. ఇలా సన్నజాజి పూలు వ్యాపారులకు, కూలీలకు, రైతులకు ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నాయి. అయితే ఇటీవల పెరిగిన పెట్టుబడి వ్యయం, పెరిగిన కూలీలు, మందుల ఖర్చులు, కూలీల కొరత, రైతును చుట్టుముట్టి ఆదాయానికి గండికొడుతున్నాయి.

దక్షిణాదిలో ప్రత్యేక గుర్తింపు

ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలలో వాల్మీకిపురం సన్నమొగ్గలకు ప్రత్యేక గుర్తింపుతో పాటు డిమాండ్ కూడా ఉంది. బెంగళూరు వీవీఐపీల సన్మానాలకు మదనపల్లె పూల మండీల నుంచి ప్రత్యేకించి వాల్మీకిపురం సన్నమొగ్గలను ఎగుమతి చేస్తుంటారు.

వ్యాపిస్తున్న పరిమళాలు

వాల్మీకిపురం నుంచి సీజన్‌లో సన్నమొగ్గలు కర్ణాటకలోని బెంగళూరు, కోలారు, శ్రీనివాసపురం, చింతామణితో పాటు జిల్లాలోని మదనపల్లె, పీలేరు, కలికిరి, రాయచోటి, కడప, తదితర నగరాలు, పట్టణాలకు ఇక్కడి నుంచి సన్నజాజులు తరలి వెళ్తున్నాయి.

ప్రత్యేకత..

ఇక్కడి పూల ప్రత్యేకతకు నేల, నీటి స్వభావం, వాతావరణ పరిస్థితులే కారణం. మృదుత్వం, సువాసన, తదితర విషయాలలో వాటికి పోటీపడే సన్నజాజి రకాలు లేవంటే అతియోక్తి కాదు. వాల్మీకిపురం, సీటీఎం తదితర ప్రాంతాలలో వందకు పైగా తోటలు విస్తరించి ఉన్నాయి. ఇదే రకం సన్నజాజి సాగును మదనపల్లె, కలికిరి, పీలేరు ప్రాంతాలలో సాగుకు అక్కడి రైతులు యత్నించినా రాణించలేకపోవడం గమనార్హం.

సమయమే శాపం..

తోటల నుంచి కోసిన సన్నమొగ్గలను 3 గంటలలోపు సమీప మార్కెట్‌కు తరలించాలి. లేకుంటే మొగ్గలు పూర్తిగా విచ్చుకుని క్రమంగా తాజాదనాన్ని కోల్పోతాయి. తరువాత వాటిని విక్రయించడం కష్టసాధ్యమే. ఇదే రైతుల పాలిట శాపంగా మారుతోంది. రైతులు సీజన్‌లో గంటకు ఒకమారు చొప్పున తోటలలో పూలు కోసి కమీషన్ మండీలకు తరలిస్తుంటారు. సమయం చాలకపోవడంతో తమిళనాడులోని పట్టణాలకు, నగరాలకు ఈ పూలను ఎగుమతి చేయలేకున్నారు.

సమస్యలు బోలెడు..

వేలాదిమందికి ఉపాధి చూపుతూ ఓ పరిశ్రమలా ఎదిగిన సన్నజాజుల తోటల అభివృద్ధి ప్రస్తుతం రైతులకు గుదిబండగా మారింది. సన్నజాజుల తోటలతో ఇటు కూలీలకు, అటు వ్యాపారస్తులకు కమీషన్ ఏజెంట్లకు సిరులు కురిపిస్తున్నా పెరిగిన పెట్టుబడి వ్యయం, కూలీల కొరత, పెరిగిన కూలీల ధరలతో రైతులు కుదేలవుతున్నారు. ఆదాయానికి మించి ఖర్చులు, మరోపక్క ఏ ఇతర వ్యాపారాల్లో లేని విధంగా కమీషన్ ఏజెంట్లు రూ.12.5 శాతం వసూలు చేస్తున్నందున నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు..

బెంగళూరు తదితర ప్రాంతాలకు పూలు త్వరగా చేరేలా ప్రభుత్వం రవాణా సౌకర్యం కల్పిస్తే రైతులకు ఆదాయం కూడా పెరుగుతుంది. అంతేకాక కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పనులను పూల వ్యవసాయానికి అనుసంధానం చేసినట్లయితే రైతుకు కూలీల బెడద తప్పి లాభాల బాటన పయనించే అవకాశం ఉంటుంది. తద్వారా మరింతమందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని పూల తోటల సాగు రైతులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.


వాల్మీకిపురం పరిసరాల్లోని సన్నజాజి తోటలు

సక్రమంగా కూపన్ల పంపిణీ

- అవకతవకలకు తావివ్వొద్దు
- కూపన్ల నమోదును పరిశీలించిన సబ్ కలెక్టర్

రాజంపేట, సెప్టెంబరు 10: ఇసుక కూపన్ల పంపిణీలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ నిదియాదేవి సిబ్బందిని ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'ఉచిత ఇసుక విధానానికి ఆదిలోనే అధికారుల తూట్లు' అన్న శీర్షికన కథనం ప్రచురితం కావడంతో రాజంపేట మండలం కూచివారిపల్లె ఇసుక కూపన్ సెంటర్‌ను సబ్ కలెక్టర్ నిదియాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ ఇసుక కూపన్ కేంద్రంలో జరుగుతున్న కూపన్ల నమోదును పరిశీలించారు. కూపన్ల నమోదులో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలని ఆదేశించారు.


కూచివారిపల్లె ఇసుక కూపన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

వాల్మీకిపురం జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

పీలేరు, సెప్టెంబరు 10: పీలేరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అంశంలో జిల్లా యంత్రాంగం మరో అడుగు ముందుకు వేసింది. గతంలో పీలేరు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ ఈవోగా పనిచేసిన కె.రెడ్డిప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఇప్పటికే పీలేరు సర్పంచుల చెక్ పవర్ రద్దు చేసిన జిల్లా యంత్రాంగం, అప్పట్లో విధుల్లో సరిగ్గా వ్యవహరించని అధికారులపై కూడా చర్యలకు పూనుకుంది. రెడ్డిప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఈనెల 6వ తేదీనే ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అవి మంగళవారం పీలేరుకు చేరాయి. మంగళవారం రాత్రి ఈ విషయం బయటకు పొక్కింది. ఇదే అంశంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈవోపీఆర్‌ఆర్‌డీలు వరప్రసాద్, గఫూర్‌లపై కూడా చర్యలు తీసుకుంటారని మరో పుకారు వ్యాపించింది.

కొండ్రాజుపల్లెలో బాలిక ఆత్మహత్య


మాధవి మృతదేహం

కాశినాయన, సెప్టెంబరు 10: కొండ్రాజుపల్లెలో కత్తెరగండ్ల మాధవి(13) ఉరివేసుకుని చనిపోయినట్లు ఎస్‌ఐ హనుమంతు తెలిపారు. పోలీసులు, గ్రామస్థుల వివరాలమేరకు చెన్నయ్య పీరమ్మ దంపతుల కూతురు మాధవి వరికుంట్ల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. 10రోజుల కిందట మాధవి ఇంటికి వచ్చి తిరిగి పాఠశాలకు వెళ్ళలేదు. అనారోగ్యంతో ఉండడంతో ఇంటివద్దే ఉంచగా, మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబీకులు తెలిపారన్నారు. పోలీసులు కేసునమోదు శవాన్ని పోస్టుమార్టం కోసం పంపామన్నారు. మృతికి గలకారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సిఉంది. కాగా రెండేళ్ల కిందట మృతురాలి తండ్రి చెన్నయ్య అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు.

దళితులపై వైసీపీ నేతల దాడి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 10: పులపత్తూరు వాసి కుంభగిరి వెంకటసుబ్బయ్య, ఎల్లయ్యపై వైసీపీ నేతలు దాడి చేశారని పోలీసులు తెలిపారు. గత ఎన్నికల్లో వెంకటసుబ్బయ్య టీడీపీ ఏజెంటుగా పనిచేశాడని, తమ మాట వినలేదని కక్షపెట్టుకున్న వారు సోమవారం వినాయక నిమజ్జన సమయంలో మా ఇళ్ల మీదుగా ఎలా వెళతారంటూ నిలదీశారు. అంతేకాకుండా తామరచెరువు వద్ద ప్రసాద్‌రెడ్డి, వంశీరెడ్డి, కార్తీకరాజు, రాజశేఖర్‌రెడ్డి, శివకుమార్‌రాజు, సుధీర్‌రాజు, శ్రీనివాసరాజు అర్ధరాత్రి విచక్షణా రహితంగా దాడి చేశారు. వారినుంచి తప్పించుకుని అడవి మార్గాన రేణింతల పైనుంచి రాజంపేట మన్నూరు పోలీసుస్టేషన్‌కు చేరుకుని తల దాచుకున్నట్లు తెలిపారు. దాడి ఘటనను మన్నూరు పోలీసులకు తెలపడంతో వారు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుపై విచారిస్తున్నట్లు మన్నూరు సీఐ రామాంజనేయుడు తెలిపారు.

బాధితుడిని పరామర్శించిన సుగవాసి


వెంకటసుబ్బయ్యను పరామర్శిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

గత ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇచ్చిన వెంకటసుబ్బయ్యపై వైసీపీ రౌడీ మూకలు విచక్షణా రహితంగా దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపర చర్యలు చేపట్టాలని ఆయన సీఐని కోరారు. కార్యకర్తకు ఆపదలో తాము వెన్నంటుంటామని ఆయన భరోసా కల్పించారు. టీడీపీ నేతలు గన్నే సుబ్బనరసయ్య, గుగిళ్ల చంద్రమౌళి, తుపాకుల అశోక్, టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి రమణ, నామా హరి, షామీర్‌బాషా, సుబ్బరాయుడు, మేకవారిపల్లె రమణ పరామర్శించారు.

వైవీయూలో బీకాం హానర్స్ ప్రారంభం : వీసీ



సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10: వైవీయూలో బీకాం హానర్స్ కోర్సు ప్రారంభించినట్లు వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం వైవీయూలో బీకాం హానర్స్ నూతన కోర్సును రిజిస్ట్రార్ ప్రొఫెసరు ఎస్.రఘునాథరెడ్డితో కలిసి లాంఛనంగా కోర్సు ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ డిగ్రీకోర్సు ప్రారంభించడం ఇది మొదటి సారి అని, విద్యార్థుల చదువుకు అన్నివిధాలా వైవీయూ అనువైనదన్నారు. రాష్ట్రంలోనే విశ్వవిద్యాలయాలతో పోల్చుకుంటే వైవీయూలో ఉన్న సదుపాయాలు మరెక్కడాలభించవన్నారు. ఇక్కడున్న మానవ వనరులు మౌలిక సదుపాయాలు విద్యార్థులకు సౌకర్యవంతంగా ఆహ్లాదకరంగా చదువుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. రిజిస్ట్రారు రఘునాథరెడ్డి మాట్లాడుతూ బీకాం విద్యార్థులు యోగివేమన అధ్యాపకులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నాణ్యమైన విద్యాబోధన అందిస్తారన్నారు. చదువుల గురించి సందేహాలు వచ్చినప్పుడు సహాయ సహకారాలు అందిస్తారని మార్గదర్శనం చేస్తారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

23 టీఎంసీలు దాటిన గండికోట నీటిమట్టం



కొండాపురం, సెప్టెంబరు 10: గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం 23 టీఎంసీలు దాటినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గండికోట ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా 10000 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టులోకి 25 టీఎంసీల నీరు చేరిన తర్వాత అంటే రెండు,మూడు రోజుల్లో మైలవరం జలాశయానికి నీరు విడుదల చేయనున్నట్లు డీఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలని తెలిపారు.

చిలమకూరు అవినీతిపై కలెక్టర్ కొరడా

- పంప్ ఆపరేటర్ విధుల నుంచి తొలగింపు
- సొమ్ము రికవరీ - కేసు నమోదుకు ఆదేశం

ఎర్రగుంట్ల సెప్టెంబరు 10: చిలమకూరు పంచాయతీలో జరిగిన అవినీతిపై కలెక్టర్ లోతేటి శివశంకర్ కొరడా ఝుళిపించారు. పదేళ్లగా జరుగుతున్న అవినీతి అక్రమాలపై వచ్చిన ఆరోపణలపై వేసిన కమిటీ నివేదిక మేరకు పంపు ఆపరేటర్ ఆవుల రామకృష్ణ అక్రమాలకు పాల్పడ్డాడని, అతన్ని వెంటనే విధుల నుంచి తొలగించాలని కలెక్టర్ మండల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పని చేయకుండా తీసుకున్న రూ.4,53,600 జీత భత్యాలను రికవరీ చేస్తూ రామకృష్ణపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. 2019 నుంచి విధులకు హాజరు కాకుండా పంచాయతీకి సంబంధించిన 35 పనులు భార్య పేరుతో నిర్వహించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడని రుజువైంది. సొంత స్థలంలో బోరు వేసి ప్రభుత్వ డబ్బుతో మోటారు అమర్చి నీటి వ్యాపారం చేశాడన్న ఆరోపణ, విధులకు హాజరు కాకుండా జీతాలు తీసుకున్నాడన్న ఆరోపణ, స్థానిక ఐసీఎల్ విరాళంగా ఇచ్చిన సొమ్ములో అవినీతి జరిగిందని బీజేపీ ఎంపీటీసీ నవీన్‌కుమార్ గతంలో కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం, మండల సమావేశాల్లో ప్రస్తావనకు తీసుకువచ్చారు. ఈవిషయం పై ప్రత్యేక కమిటీని విచారణకు డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో నియమించారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించినా టీడీపీ ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి టీడీపీ ఇచార్జి భూపేష్‌రెడ్డి ఆదేశాల మేరకు విచారణ వేగవతం చేసి నివేదిక కలెక్టర్‌కు పంపారు.

చిలమకూరు పంచాయతీలో ఎన్ఎంఆర్(పంప్ ఆపరేటర్) రామకృష్ణ కార్యదర్శితో కలిసి 2014 నుంచి 2024 వరకు రూ.35 లక్షల నిధులు దుర్వినియోగం చేశాడు. సీసీరోడ్లు ,సైడ్ కాల్వలు, కొత్త బోర్లు, పైపుల నిర్మాణాలు, కొత్త మోటార్ల కొనుగోలు, తదితరాలన్నింటినీ రామకృష్ణ తన భార్య పార్వతి దేవి పేరుతో చేశారని ఆరోపణ. ఐసీఎల్ వారు గ్రామ అభివృద్ధి కోసం ఇచ్చిన నిధుల్లో కూడా అవినీతి జరిగినట్లు ఫిర్యాదు చేశాడు. రామకృష్ణ సొంత స్థలంలో బోరు వేసి పంచాయతీ డబ్బుతో కొన్న మోటార్లు అమర్చి పంచాయతీకి నీటిని అమ్మేడని ఆరోపణలున్నాయి. ఐదేళ్లగా పనిచేకున్నా జీతం తీసుకున్నాడని ఎంపీటీసీ ఆరోపించారు.

అన్నమాచార్య అధ్యాపకుడికి డాక్టరేట్



సిద్ధవటం, సెప్టెంబరు 10: అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల సహాయ ఆచార్యులు ఓ.హోమకేశవ్‌కు డాక్టరేట్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ అధ్యాపకుడు హోమకేశవ్‌కు తమిళనాడు రాష్ట్రం ఏలూరు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ఇచ్చిందన్నారు. ఏలూరు వీఐపీ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ జి.కె.రజని పర్యవేక్షణలో పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్ లభించడంపట్ల విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, వైస్‌ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు ఏవో రామసుబ్బారెడ్డి తదితరులు అభినందించారు.

జగనన్న కాలనీ కహానీ


ఉర్లగట్టుపోడు జగనన్న కాలనీ

బిల్లులు తీసుకుని కాంట్రాక్టర్లు పరారీ ● కొందరికి బేస్‌మెంట్లే పరిమితం
మరికొందరికి స్థలాలే మిగిలిన వైనం ● లబోదిబోమంటున్న లబ్ధిదారులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 10: నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుస్తానని ఆర్భాటపు ప్రకటనలు చేసిన వైసీపీ ప్రభుత్వం చాలీచాలని ఇంటి పట్టాలను ఇచ్చింది. అంతేకాకుండా సొంతంగా ఇళ్లు కట్టిస్తామన్న ప్రభుత్వం చేతులెత్తేయడంతో నిరుపేదలు ఇళ్లు పూర్తి చేసుకోలేక అష్టకష్టాలు పడుతున్నారు. కొన్నింటి బిల్లులు తీసుకుని కాంట్రాక్టర్లు పరారయ్యారనే ఆరోపణలున్నాయి. కొందరికి బేస్‌మెంట్‌లు మిగలడం, మరి కొందరు ఇంటి స్థలాలకే పరిమితమయ్యారు. రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో జగన్ ప్రభుత్వం 6378 మంది లబ్ధిదారులకు అట్టహాసంగా ఇళ్ల పంపిణీ చేపట్టారు. ఐదేళ్లలో లబ్ధిదారులకు ఇళ్లు పూర్తి చేయాలనే ధోరణిలో చర్యలు తీసుకోలేకపోయారు. దీంతో చాలా మంది ఇళ్లు పూర్తి చేసుకోలేకపోయారు. వివరాల్లోకెళితే....

రైల్వేకోడూరు మండలంలో 2288 మందికి, చిట్వేలిలో 834, ఓబులవారిపల్లెలో 1226, పెనగలూరులో 1228, పుల్లంపేటమండలాల్లో 802 మందికి పట్టాలు ఇచ్చారు. మొత్తం 2788 మంది లబ్ధిదారులు ఇళ్లను పూర్తి చేసుకున్నారు. 240 ఇళ్లకు శ్లాబులు పూర్తి అయ్యాయి, 807 ఇళ్లు బేస్‌మెంట్లవరకు, 575 ఇళ్లు గోడల లెవల్‌కు, 235 ఇళ్లు పునాది లెవ ల్‌లో ఉన్నాయి. పూర్తి కాని ఇళ్లలో పిచ్చి మొక్కలు మొలిచాయి. జగన్ కాలనీల్లో రోడ్లు లేక ఇబ్బంది లు పడుతున్నారు. ఇళ్ల వద్ద మురికి గుంతలు ఏర్ప డ్డాయి. మట్టి రోడ్లపై కంప చెట్లు మొలిచాయి. స్థలాలకు పరిమితమైన వారు బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. ఇళ్లను ప్రభుత్వమే నిర్మిస్తామని చెప్పి వైసీపీ ప్రభుత్వం మాట తప్పిందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల కోసం వైసీపీ నేతలు కొందరు కాంట్రాక్టర్లను నియమించారు. పేమెంట్లు కాంట్రాక్టర్లకే ఇవ్వాలని లబ్ధిదారులకు అధికారులు, నాయకులు సమాచారం పంపించారు. అయితే బిల్లులు పడిన వెంటనే కాంట్రాక్టర్లు పరారీ అయ్యా రని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో పా ములు, తేళ్లు తిరుగుతున్నాయని లబ్ధిదారులు ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో రోడ్ల సౌకర్యా లు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. తా గునీరు, విద్యుత్ తదితర మౌలిక సౌకర్యాలు లేక అనేక కష్టాలు పడుతున్నామని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హౌసింగ్ శాఖ ఇచ్చిన డబ్బు సరిపోక కొందరు అప్పు చేసి ఇళ్లను నిర్మించుకున్నారు. జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో చాలా మంది కాపురాలు చేయలేకున్నారని లబ్ధిదారులు వివరిస్తున్నారు. రాత్రి వేళ బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్‌పై ఆశలు పెంచుకుంటే ఇలా చేస్తా రా అని తిట్టిపోసుకుంటున్నారు. బేస్‌మెంట్‌లు వేసుకుని ఐదేళ్లు పూర్తి అయినా ఇంత వరకు చా లా మందికి బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశా రు. ఐదేళ్లలో సొంత ఇంటికి సక్రమంగా ప్రారంభోత్సవాలు కూడా చేసుకోలేని స్థితికి లబ్ధిదారులు చేరుకున్నారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వంలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలో చాలీచాలని ఇంటి స్థలాలు ఇచ్చి అదికూడా పూర్తి చేయకుండా చేశారని లబ్ధిదారులు అంటున్నారు. ఇప్పటికైనా హౌసింగ్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టి ఇంటి నిర్మాణాల్లో ఎంత వరకు జాప్యం జరిగిందని ప్రభుత్వానికి నివేదిక ఇస్తే లబ్ధిదారులకు మేలు కలుగుతుందని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

స్థలం ఉంది పక్కాగృహం లేదు



స్థలం ఇచ్చారు, ఇల్లు కట్టివ్వలేదు. కనీసం పునాది లెవల్‌కు కూడా చేరుకోలేదు. బిల్లు వచ్చిందో రాలేదో తెలియదు. ఖాళీ స్థలంలో గుడిసె వేసుకుంటే పీకేశారు. బంధువుల ఇంట్లో తలదా చుకుంటున్నాము. కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరుకుంటున్నాము.

వంకాయల మంజుల, వెంకటేష్

చర్యలు తీసుకుంటున్నాము

కాలనీల్లో పెండింగ్ ఇంటి నిర్మాణాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాము. జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపి ఉన్నాము. కాలనీల్లో ఉన్న సమస్యలు పరిష్కారం చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపుతాము.

మురళీక్రిష్ణ, ఏఈ రైల్వేకోడూరు హౌసింగ్


ఇంటివద్ద పెరిగిన పిచ్చి మొక్కలు


శ్లాబు పూర్తిన ఇంటి వద్ద చేరిన మురికినీరు


జగనన్న కాలనీలో రోడ్ల దుస్థితి


పునాదికే పరిమితమైన దృశ్యం

డాడీహోంలో ఆకస్మిక తనిఖీ

సమస్యలు వివరించిన వృద్ధులు ● ఆలస్యంగా వెలుగు చూసిన వైనం


రికార్డు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్ - డాడీ హోంలో వృద్ధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

జమ్మలమడుగు, సెప్టెంబరు 10: మైలవరం డాడీహోంలో జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ శ్రీనివాస్, స్థానిక సిబ్బందితో 6వ తేదీ వెళ్లి పరిశీలించినట్లు సమాచారం ఆలస్యంగా వెలుగు చూసింది. డాడీహోం యజమాని రాజారెడ్డి మృతి తర్వాత కొత్త కమిటీని ఏర్పాటు చేశారని, మళ్లీ కమిటీ మారిందని, వృద్ధులు తెలిపినట్లు సమాచారం. పది రోజుల కిందట డాడీహోం వృద్ధాశ్రమం వృద్ధులు, విద్యార్థులు, సిబ్బంది ఫౌండేషన్ వివాదంపై ప్రస్తుతం తమకు సేవలు సక్రమంగా అందడం లేదని, రక్షణ కల్పించాలని కలెక్టర్ కార్యాలయంలో బాధితులంతా వెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు ఆర్డీఓ, స్థానిక సిబ్బందితో ఆకస్మికంగా 6వ తేదీ వెళ్లి పరిశీలించినట్లు సమాచారం ఆలస్యంగా వెలుగు చూసింది. తనిఖీ చేసిన సమస్యలు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఏదేమైనా కమిటీ ట్రస్టు, డాడీహోం, ప్రొద్దుటూరు సమీపంలో ఉన్న పూజా ఇంటర్నేషనల్ స్కూల్‌పై క్షుణ్ణంగా విచారించినట్లు బాధితుల ద్వారా తెలుస్తోంది. డాడీహోంలో విద్యార్థులు, వృద్ధులకు జరుగుతున్న అన్యాయాన్ని కమిటీ ఏమాత్రం పట్టించుకోవడంలేదని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి బాధితులు తీసుకెళ్లి వినతి పత్రం అందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అనాథలు, అభాగ్యులు, వృద్ధులు, పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం, జిల్లా అధికారులు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. తమకు న్యాయం జరుగుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నట్లు బాధితులు మంగళవారం విలేకరులకు తెలిపారు.

బాలికల ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

చిన్నమండెం, సెప్టెంబరు10: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ చామకూరి శ్రీధర్ పాఠశాలలో ఉపాధ్యాయులు అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, పాఠశాలలో రోజు వారి అమలు చేస్తున్న మెనూ ప్రకారం, లెసన్ ప్రణాళికలు, టాయిలెట్స్ నిర్వహణలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులపై రమాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల గట్టుపై కూర్చుని విద్యార్థినులతో మమేకమై చదువుపై వారికి గల ఆసక్తి పాఠ శాలలో విద్యాబోధన, అమలు చేస్తున్న మెనూపై ఆరా తీశారు. మెనూ నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసిన విద్యార్థిను లు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలలో భోజనం చేసి కలెక్టర్ మెనూ నాణ్యతను పరిశీలించారు.

సమస్యలపై ఆరా తీసిన కలెక్టర్

పాఠశాలలో నెలకొన్న సమస్యలపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆరా తీశారు. పాఠశాలకు ప్రహరీ లేదని, ఏర్పాటు చేయాలని, తాగునీరు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించిన విద్యార్థినులు, ఉపాధి హామీ కింద ప్రహరీ వరకు ప్రతిపాదనలు ఇచ్చామని, ఇంకా మంజూరు కాలేదని కలెక్టర్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి వివరించారు. ప్రహరీ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటామని, ప్రత్యేక నిధులతో తాగునీటి కొరకు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని విద్యార్థినులకు హామీ ఇచ్చిన కలెక్టర్ సర్వేయర్‌తో పాఠశాల ప్రహరీ కొలతలు వేయించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు వల్లూరు బాలికలు


ఎంపికైన విద్యార్థులతో పీఈటీ

వల్లూరు, సెప్టెంబరు 10: రాష్ట్రస్థాయి అండర్ 19 ఖోఖో విభాగం పోటీల్లో మోడల్ స్కూలు ఇంటర్ బాలికలు ఇద్దరు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్ తెలిపారు. సీనియర్ ఎంపీసీ మమత, బైపీసీ చదువుతున్న మోబీన జిల్లా స్థాయి పోటీల్లో రాణించడంతో వీరు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన బాలికలను, ప్రోత్సహించిన పీఈటీ సుశీలమ్మను పలువురు అభినందించారు.

మహిళా డిగ్రీకళాశాలకు 31వ ర్యాంకు

- ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10: ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకు సర్వే 2024-25కు జాతీయ స్థాయిలో కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు 31వ ర్యాంకు లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు కళాశాలకు దక్కిందన్నారు. రాయలసీమ మహిళా డిగ్రీ కళాశాలలో ఇటువంటి ర్యాంకులు వచ్చిన ఏకైక కళాశాల కావడం గర్వంగా ఉందన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన కంచయ్య

రాజంపేట టౌన్, సెప్టెంబరు 10: స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలో మంగళవారం బస్సు - బైకు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇసుకపల్లె నుంచి పట్టణంలో కూలీకి వచ్చి భోజనం కోసం వెళుతుండగా కడప డిపో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో పొట్లూరు కంచయ్య, మేకల వెంకటయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటయ్య తలకు తీవ్ర గాయమవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. రాజంపేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నిమజ్జనాల్లో అపశృతులు అరికట్టాలి

వేంపల్లె, సెప్టెంబరు 10: వినాయక నిమజ్జనాల్లో అపశృతులు అరికట్టాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి సూచించారు. మంగళవారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ సోమవారం కడప, తిరుపతి జిల్లాల్లో మృతులు, గల్లంతులవడం శోచనీయమన్నారు. కడప జిల్లా వీరపునాయునిపల్లెలో ఇద్దరు, చక్రాయపేట మండలంలో ఒకరు, తిరుపతి జిల్లా నాయుడుపేటలో గల్లంతైన ముగ్గురిలో ఒకరి శవం దొరకడంలాంటి దురదృష్టకర సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు. మరోవారం రోజులు నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతాయని, తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీ

ఖాజీపేట, సెప్టెంబరు 10: అంజనేయకొట్టాలు దారిలోని ఫ్లైఓవర్ వద్ద రేషన్ బియ్యాన్ని ప్రజా సంఘాల నేతలు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు ప్రజా సంఘాల నాయకులు సీఐ మోహన్‌కు తెలపడంతో లారీని, బియ్యాన్ని తహసీల్దారు సరస్వతికి అప్పగించారు. తహసీల్దారు బియ్యాన్ని శాంపిల్ చూసి ల్యాబ్‌కు పంపారని, నివేదిక వచ్చిన తర్వాత చర్యలు చేపడతామన్నారు.

వరద బాధితులకు రూ.5లక్షలు విరాళం


మంత్రి నారాలోకేశ్‌కు విరాళం అందిస్తున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, చిత్రంలో మంత్రి మండిపల్లి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 10: వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్సీ భూమిరెడ్డిరాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.5లక్షల చెక్కును అందించారు. పలువురు దాతలు ఇచ్చిన రూ.5లక్షల చెక్కు, డీడీలను విజయవాడలో మంత్రి నారాలోకేశ్‌కు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అందించారు. దాతల సహాయ సహకారాలు మరువలేమని, ఎమ్మెల్సీని లోకేశ్ అభినందించారు.

ఐదేళ్ల ఎమ్మెస్సీ ప్రవేశానికి రేపు ఆఖరు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 10: వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ ప్రవేశానికి రేపటితో ఆఖరని వైవీయూ డైరెక్టరు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియలజీ కోర్సులో ప్రవేశాలకు 11, 12 తేదీల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికిమంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కోర్సుల్లో ప్రవేశానికి అర్హులని స్పష్టం చేశారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

● వామపక్షాలు, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో



రాయచోటిలో రాస్తారోకో చేస్తున్న అఖిల పక్ష ట్రేడ్ యూనియన్ నేతలు, రైతు సంఘాలు, ప్రజా సంఘాల నేతలు



రాజంపేటలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న వామపక్షాల నేతలు



రైల్వేకోడూరులో రాస్తారోకో చేస్తున్న వామపక్షాల నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు10: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష ట్రేడ్ యూనియన్‌లు, రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీ. శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, సీపీఐ (ఎంఎల్) విశ్వనాథ్, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు, రైతు సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు వంగిమళ్ల రంగారెడ్డి, బసిరెడ్డిలు మాట్లాడుతూ రూ.9 వేల కోట్ల పెట్టుబడికి 58 వేల కోట్ల డివిడెండ్ చెల్లించిన విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఇందులో భాగంగానే బ్లాస్ట్ ఫర్నేస్ రెండింటిని ఉద్దేశపూర్వకంగా మూసివేశారని, 75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం నుంచి 30 లక్షల టన్నులకు స్టీల్ ఉత్పత్తి పడిపోనుందని తెలిపారు. దీంతో అనివార్యంగా నష్టాల్లోకి విశాఖ ఉక్కును నెట్టాలని బీజేపీ మోడీ ప్రభుత్వం భావిస్తోందని, రాష్ట్ర పార్లమెంట్ సభ్యులు బలంపై ఆధారపడి నడుస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరణ ప్రకటన చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుకు గనులు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. విశాఖ ఉక్కును వదులుకోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని, అవసరమైతే మరో అంతిమ పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ, సుబ్రమణ్యంరాజు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్రమ్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు, నరసింహులు, వేణుగోపాల్‌రెడ్డి, మురళి, వెంకట్రమణ, ఆకార్స్ యూనియన్ నాయకులు చంద్ర, సీపీఐ (ఎంఎల్) నాయకులు పూసపాటి రమణ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట బైపాస్ ఎన్టీఆర్ సర్కిల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ ఉక్కు పరిశ్రమ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, ఏఐటీయూసీ నేతలు సికిందర్, నాగేశ్వరరావు, రమణ, సురేష్, సుబ్రమణ్యం, నరసింహా, రాఘవేంద్ర, రవి, లోకేష్, ఆంజనేయులు, లింగన్న, రంగన్న, బలరాం, కృష్ణ, విరోబా, సీఐటీయూ ప్రసాద్, రమణ, మల్లి పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమను స్థాపించాలని వామపక్షాల నేతలు తుమ్మల రాధాకృష్ణయ్య, సీహెచ్ చంద్రశేఖర్, పందుగోల మణి డిమాండ్ చేస్తూ రైల్వేకోడూరు ప్రధానదారిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విభజన చట్టం ప్రకారం కడపలో ఉక్కు పరిశ్రమను స్థాపించకపోతే దశలవారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాస్తాకోరో విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఆందోళన కారులను అదుపులోకి తీసుకున్నారు. దార్ల రాజశేఖర్, శివయ్య, వెంకటేష్, మోడి సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు



పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

రామాపురం, సెప్టెంబరు 10: మారుతు న్న వాతావరణ పరిస్థితులకు అనుగుణం గా ఉత్తమ వ్యవసాయ పద్ధతులు ఆచ రించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని అన్నమ య్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్ తెలిపారు. మంగళవారం గోప గుడిపల్లె పంచాయతీ గొల్లపల్లిలో పొలం బడి కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చునన్నారు. విత్తనశుద్ధి తో నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించవచ్చునన్నారు. వేరుశనగ పంట చుట్టూ నాలుగు వరుసల్లో జొన్నను రక్షక పంటగా వేసుకోవడం ద్వారా తామర పురుగులను నివారించవచ్చునని, ఆముదం ఎర పంటగా వేసుకోవడం ద్వారా పొగాకు లద్దె పురుగును నివారించు కోవచ్చు నన్నారు. వేరుశనగ పొలంలో రసం పీల్చు పురుగుల నివారణకు వేపనూనె పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. చాలా కాలం నుంచి బీడుగా ఉన్న భూములను సాగులోకి తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగమణి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బాలికల గురుకులంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి టౌన్, సెప్టెంబరు 10: పట్టణ పరిధిలోని మాసాపేటలో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం రాత్రి కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో భద్రతపై విద్యార్థినులను ప్రశ్నించారు. పాఠశాలలో పురుష టీచర్లు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు ఎప్పుడైనా హాస్టలుకు వస్తుంటారా అని ఆరా తీశారు. ఇతర సమస్యలేవైనా ఉన్నాయా అని అడగగా, పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్, బోరుకు మరమ్మతులు చేయించాలని విద్యార్థినులు కోరారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి, సబ్ ఫారెస్ట్ ఆఫీసర్ శుభం, గిరిజన సంక్షేమశాఖ అధికారి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణన్ నేషనల్ అవార్డుకు రాజశేఖర్

చిట్వేలి, సెప్టెంబరు 10: సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డుకు స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు పసుపుల రాజశేఖర్ ఎంపికయ్యారు. ఇంగ్లీషు టీచర్, ఎన్‌సీసీ అధికారిగా ఆయన సేవలందిస్తున్న రాజశేఖర్ 2024 సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డుకు ఎంపికయ్యారు. 14న తిరుపతిలో అవార్డు అందుకోనున్న ట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం పురుషోత్తమరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

జీవో 85కు వ్యతిరేకంగా ప్రభుత్వ వైద్యుల ఆందోళన

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 10: జీవో 85కు వ్యతిరేకంగా పీహెచ్‌సీల్లోని వైద్యులు మంగళవారం నల్లరిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేశారు. పదో తేదీ నుంచి ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ జీవో ద్వారా తమ మూడేళ్ల సర్వీసు అర్థంలేకుండా పోతుందని, దీంతో తమ ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని వాపోయారు. గత రెండు నెలలుగా జీవో 85 రద్దు చేయమని అధికారులకు, శాసనసభ్యులకు అర్జీలు సమర్పించినా ఇప్పటివరకు ఎటువంటి సమాధానం రాలేదని వైద్యులు నిరాశ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గురు మహేష్, డాక్టర్ దీప, సీహెచ్‌వో నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె:నల్లరిబ్బన్ ధరించి విధులు నిర్వహిస్తున్న డాక్టర్ గురుమహేష్



రాయవరం వైద్యశాలలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

సుండుపల్లె: సుండుపల్లె మండలంలోని రాయవరం ప్రాథమిక వైద్య కేంద్రంలో ఉన్న వైద్యులు నిరసన తెలియజేశారు. మంగళవారం ప్రాథమిక వైద్య కేంద్రం ఆవరణంలో నల్ల బ్యాడ్జీలతో తమ నిరస నను తెలి యజేశారు. ఈ జీవో ద్వారా తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోతుందని ఇలా ఆకస్మాత్తుగా జీవో మార్చడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తగవు

● బలవన్మరణాలపై విద్యార్థులకు అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్

సంబేపల్లె, సెప్టెంబరు 10: క్షణికావేశంలో తీసుకునే తొందరపాటు నిర్ణయాలతో దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సగటున 1.70 లక్షల మంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలకు ప్రాణాలు తీసుకుని తల్లిదండ్రులకు గర్భశోకం కలిగించడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలన్నారు. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన వచ్చినపుడు తల్లిదండ్రులు, పెద్దలు, గురువులు, స్నేహితులతో మన భావాలు పంచుకుంటే అటువంటి ఆలోచనల నుంచి మనం బయటపడగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పెడబల్లి నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు

రామాపురం, సెప్టెంబరు10: మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12, 13 తేదీల్లో మండల స్థాయి అండర్-14, అండర్ -17 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, మండల కోఆర్డినేటర్ పీడీ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. 12న యోగా, షటిల్, చెస్, అథ్లెటిక్స్ బడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయని, ఉదయం 9.30 గంటలకు క్రీడాకారులు హాజరుకావాలన్నారు. అండర్-14, అండర్ -17 పోటీల్లో బాలబాలికలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు

అంగన్వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

సుండుపల్లె, సెప్టెంబరు10: అంగన్వాడీల సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఏసీడీపీ సుగుణమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలకు తగిన సూచనలు, సలహాలను అందజేశారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. వరకట్నం తీసుకోవడం నేరమని అలా ఎవరైనా తీసుకున్నా, మహిళలను వేధించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ అంజుమ్, సూపర్‌వైజర్ వనజమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.



పౌష్టికాహార మాసోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏసీడీపీవో, సిబ్బంది

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సుండుపల్లె, సెప్టెంబరు 10: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు నాగరాజునాయక్, నాగేంద్ర బాబును మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యా యులు, విద్యార్థులు ఘనంగా సన్మానించినట్లు ప్రధానోపాధ్యాయుడు జయన్న తెలిపారు. వృత్తినే దైవంగా భావిస్తూ విద్యార్థుల శ్రేయస్సు కోసం కష్టపడి పనిచేసే ఉపాధ్యాయులకు అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరికుమార్, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వేమన పద్యాల పుస్తకాలు పంపిణీ



వేమన పద్యాల పుస్తకాల పద్యాలను అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందలూరు, సెప్టెంబరు 10: మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, రమణమ్మ విద్యార్థులకు వేమన పద్యాల పుస్తకాన్ని పంపిణీ చేశారు. కడపకు చెందిన రెడ్డి సేవాసమితివారు ఈ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర ప్రసాద్, శిల్పి ఆనందాచారి, రవిశంకర్‌రెడ్డి, విజయకుమారి, తులసి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్‌లో అవినీతిపై విచారణ చేయాలి..

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 10: కలికిరి మార్కెట్ యార్డులో సిబ్బంది అవి నీతిపై విచారణ జరిపించాలని సీపీఐ రైతు సంఘం నాయకులు వంగిమళ్ల రంగారెడ్డి, వెంకటేష్ మంగళవారం నాడు కలెక్టర్ కార్యాలయంలోని ఏఓకు వినతిపత్రం సమర్పిం చారు. భవనాల అద్దెలను రెన్యువల్ చేసినప్పుడు షాపు యాజమానుల దగ్గర అక్ర మంగా వసూళ్లు చేస్తున్నారన్నారు. రైతు నుంచి కేవలం 2 శాతం కమిషన్ వసూలు చేయాలని నిబంధనలు 15 నుంచి 20 శాతం వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయాలపై ఉన్నతాధికారులు పూర్తిగా విచారించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న వంగిమళ్ల రంగారెడ్డి.

పెండ్లిగుండ్ల దక్షిణ ముఖ వినాయకుడికి పూజలు

సుండుపల్లె, సెప్టెంబరు10: మండలంలోని సుండుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో రెడ్లచెరువు, కొత్తవడ్డెపల్లెల మధ్య ఉన్న పెండ్లిగుండ్లలో వెలసిన దక్షిణముఖ వినాయకుడికి పలువురు భక్తులు మంగళవారం పూజలు నిర్వహించారు. వినాయక చవితి పండుగ నుంచి ప్రతిరోజు పెద్ద సంఖ్యలో యువకులు ఇక్కడికి చేరుకొని పూజలు నిర్వహిస్తున్నారు.



దక్షిణముఖ వినాయకుడికి పూజలు చేస్తున్న యువకులు

'విద్యారంగానికి నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం'

రాయచోటిటౌన్, సెప్టెంబరు 10: విద్యారంగానికి నిధుల కేటాయింపులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వర రావు ఆరోపించారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో రాజంపేట పట్టణంలో జరగనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య అన్నమయ్య జిల్లా నిర్మాణ మహాసభల కరపత్రాలను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి కోటేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్‌లో పదిశాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విభజన హామీల్లో భాగంగా అనంతపురం జిల్లా సెంట్రల్ యూనివర్సిటీ, కడప ఉక్కు పరిశ్రమ, పెట్రోలియం యూనవర్సిటీలకు నిధులు కేటాయించాలన్నారు. అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న ప్రధాని నరేంద్రమోడీ మాటలను బీజేపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని, ఉద్యోగ, ఉపాధి కల్పన ఊసేలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న పేద విద్యార్థులకు నష్టం కలిగించే విద్యా విధానాలకు వ్యతిరేకంగా అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్)దేశవ్యాప్తంగా పోరాటం నిర్వహి స్తోందని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు లోకేశ్, రఘుపతి, వంశీ, నారాయణ, శ్రీకాంత్, ధనకుమార్, రెడ్డికుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ కోసం సుగవాసికి వినతి

సిద్దవటం, సెప్టెంబరు 10 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బంగారుపేటకు చెందిన కుచేలయ్య, టక్కోలి ఎస్సీ కాలనీకి చెందిన నేలటూరి రవి(20), రామిరెడ్డి విశ్వంత్ రెడ్డి(12)కి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు కృషి చేయాలని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



సుగవాసికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

నిమజ్జనానికి తరలిన గణనాథులు



రామాపురం: కొత్తరోడ్డు నారాయణపురంలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు

రాజంపేట, సెప్టెంబరు 10 : రాజంపేట పట్టణ, మండల పరిధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పలు మండపాల్లో వివిధ కార్యక్రమాలను కమిటీ సభ్యులు నిర్వహించారు. ఎర్రబల్లె వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యుడు మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య తనయుడు పవన్, ప్రదీప్ తనతండ్రి జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. అనంతరం గత మూడు రోజులుగా వివిధ సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. సాయినగర్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు ఉట్టి లాగే కార్యక్రమాన్ని నిర్వహించారు. దాసరిసంఘం 26వ వార్షికోత్సవంలో టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. తాళ్లపాక అన్నమయ్య నగర్‌లో రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు శాలువా వేసి ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఎర్రబల్లె, మన్నూరు వినాయకుడి లడ్డూను తాళ్లపాకకు చెందిన శ్యామనబోయిన గంగయ్య రూ. 1.51 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు.

రామాపురం: మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కసిరెడ్డిపల్లె, కడవకూటివాండ్లపల్లె, కొత్తరోడ్డు నారాయణపురం, గువ్వలచెరువు, రామాపురంలో నిమజ్జనాలు నిర్వహించారు.

సిద్దవటం: మండలంలోని మాధవరం-1లో నిమజ్జనోత్సవం నిర్వహించారు. స్వామివారి లడ్డూను లక్కీ డిప్ ద్వారా శంకారపు నరేష్ దక్కించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గణేష్ యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: మండలంలోని దప్పేపల్లె గ్రామం గొల్లపల్లి, వీరారెడ్డిగారిపల్లెలో నిమజ్జనం కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు, మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. టీడీపీ యువనాయకుడు యనమల మదన్‌మోహన్, టీడీపీ నాయకులు ఉమామహేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెద్దరెడ్డెయ్య, ఓబులేశ్‌యాదవ్, చిన్న ఓబులేసు, పెద్ద ఓబులేసు పాల్గొన్నారు.

సుండుపల్లె: మండలంలోని బలిజపల్లెలో విగ్రహాన్ని యువకుల కేరింతలు, నృత్యాల నడుమ కృష్టారెడ్డి చెరువులో నిమజ్జనానికి తరలించారు. జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెనగలూరు : మండలంలోని ఇండ్లూరు గ్రామంలోని సిద్ధి వినాయక స్వామి దేవాలయంలో సోమవారం రాత్రి ఎన్ఆర్ఐలు దండు మహేందర్‌రెడ్డి, గౌతమి దంపతుల సహకారంతో సోమ యానాదిరెడ్డి, లక్ష్మీదేవి దంపతులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వేలంలో ఇండ్లూరు గ్రామానికి చెందిన ఆదాల అరుణ్‌కుమార్‌రెడ్డి అలియాస్ స్టేట్‌బ్యాంకు పెంచల్‌రెడ్డి 125 కిలోల లడ్డూ ప్రసాదాన్ని లక్షా పది వేల రూపాయలకు దక్కించుకున్నారు. దేవాలయ కమిటీ సభ్యులు లడ్డూ ప్రసాదాన్ని దేవాలయ ఉత్సవ రథంపై ఉంచి అరుణ్‌కుమార్‌రెడ్డి ఇంటివరకు సాగనంపారు.

ఓబులవారిపల్లె : మండలంలోని లింగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో గణేష్ లడ్డూను చింతరాజుపల్లె సుబ్బరాయుడు రూ. 2.35 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ యువనేత ముక్కా సాయివికాస్‌రెడ్డి, గుండు శివరెడ్డి, నల్ల వెంకట సుబ్బారెడ్డి, చవ్వాకిల శంకరయ్య, గుండు పెంచల్‌రెడ్డి, ఏనుగుల శ్రీహరి, పోలి జగదీష్‌రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



సుండుపల్లె: నిమజ్జనానికి గణనాథులను తీసుకెళ్తున్న గ్రామస్తులు



వేలంలో దక్కించుకున్న లడ్డూను ఊరేగింపుగా తీసుకెళుతున్న అరుణ్‌కుమార్‌రెడ్డి



రాజంపేట: ఎర్రబల్లె లడ్డూను దక్కించుకున్న శ్యామనబోయిన గంగయ్యను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

అరవపల్లెలో వినాయకుడికి చమర్తి పూజలు

నందలూరు, సెప్టెంబరు 10: మండలంలోని అరవపల్లెలో ఏర్పాటు చేసిన వినాయకుడికి తెలుగుదేశంపార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు పూజలు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ నేత రేవూరి వేణుగోపాల్, చామంచి పెంచలయ్య, కానకుర్తి వెంకటయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్వామి సన్నిధిలో చమర్తి జగన్‌మోహన్‌రాజు

భక్తులకు అన్నదానం

మండలంలోని నాగిరెడ్డిపల్లె వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో విఘ్నేశ్వర కమిటీ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద వీరబల్లె జయకుమార్ రెడ్డి, మాధవిలత దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్, బీజేపీ నాయకులు షబ్బీర్‌అహ్మద్, పోతురాజు మస్తానయ్య, హిమగిరినాధ్‌యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు బోయ వరుణ్, తంబిశెట్టి సాయిరాం, బోయ అభినయకుమార్, తంబిశెట్టి శశాంక్, తుమ్మది ప్రవీణ్, గొల్ల అభినయ్, చలపాటి పూర్ణ, ఆధిత్య, దుర్గా మనోహర్‌రెడ్డి, ఆవుల చరిత్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో రాజంపేట బీజేపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేష్

ఉపాధి హామీ కింద స్కూలు మైదానాల అభివృద్ధి

● కలెక్టర్ సుమిత్‌కుమార్



యూటీఎఫ్, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమైన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 10: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటానని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎస్టీయూ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితా విడుదల, సీఎంసీ ఆస్పత్రి మెడికల్ బిల్లుల సమస్య, రివర్షన్ ఆర్డర్స్, పని సర్దుబాటులో అసంబద్ధతలు, కారుణ్య నియామకాలు, పాఠశాలల స్థలాల సర్వే తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారదిశగా అన్ని సమస్యలపై చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల ఆటస్థలాల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.12 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో గ్లోరియా, ఎస్టీయూ, యూటీఎఫ్ ముఖ్యనేతలు గంటా మోహన్, జీ.వి. రమణ, మదన్‌మోహన్ రెడ్డి, మోహన్ యాదవ్, సోమశేఖర్ నాయుడు, మణికంఠ, హేమచంద్రారెడ్డి, యువరాజు, రెహనా, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల బాధ్యులపై చర్యలు

మాతా,శిశు మరణాలు జరిగినట్లు తేలితే బాధ్యులైన డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారుల సమీక్షలో కలెక్టర్ హెచ్చరించారు. గ్రామీణ స్థాయిలో హైరిస్క్ గర్భిణులకు పరీక్షలు నిర్వహించి, కాన్పునకు వారం రోజులముందుగా ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పించాలన్నారు. అందుకయ్యే ఆర్థిక, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. డీసీహెచ్ఎస్ రాజశేఖర్ రెడ్డి, డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి, డీఐవో హనుమంతరావు, డీఎంఆర్ జిల్లా నోడల్ ఆఫీసర్ జానకిరావు, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన రిజిస్ట్రేషన్‌కు అవగాహన

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 10: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం విశ్వకర్మ యోజన రిజిస్ట్రేషన్లపై అవగాహన పెంచాలని కలెక్టర్ ఎంపీడీవోలను కోరారు. ఈమేరకు ఆయన వారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 18 రకాల చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం అందించేందుకు ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించిందన్నారు. లబ్ధిదారులకు రూ.15 వేలు విలువ చేసే పరికరాలు అందిస్తామన్నారు.

శ్రీవారి సేవలో రవిశంకర్



తిరుమల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్నారు.ఆలయంలోని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.60 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 67,030 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 23,476 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

పీజీ అడ్మిషన్లకు గడువు పెంపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10: పద్మావతి మహిళా యూనివర్సిటీలో పీజీ ప్రవేశ గడువును ఈ నెల 12వ తేదీ దాకా పొడిగించారు. ఏపీపీజీసెట్ ర్యాంకు పొంది, పద్మావతి వర్సిటీలో సీట్ కేటాయింపు పొందిన వారు ఈ నెల 12వ తేదీ లోపు ప్రవేశం పొందవచ్చన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు తొలుత గడువు విధించామని, విద్యార్థుల సౌకర్యార్థం 12వ తేదీ దాకా పొడిగించినట్టు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

అమెరికన్ యూనివర్సిటీలో ఎస్వీయూ ప్రొఫెసర్ల బృందం

20 రోజుల పాటు అధ్యయనం చేసే అవకాశం



ఫార్డ్యూ యూనివర్సిటీలో ఎస్వీయూ ప్రతినిధుల బృందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10: అమెరికాలోని పార్డ్యూ యూనివర్సిటీలో ఎస్వీయూనివర్సిటీకి చెందిన ఆరుగురు ప్రొఫెసర్ల బృందం పర్యటిస్తోంది. ఈ నెల 7వ తేదీ తిరుపతి నుంచి బయలుదేరిన ఈ బృందం అమెరికాకు చేరుకుంది. ఈక్రమంలో అమెరికాలోని పార్డ్యూ యూనివర్సిటీతో గతంలో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా ఈ పర్యటన కొనసాగుతూ ఉంది. ఈ పర్యటనకు రుసా నిధులు వెచ్చించనుంది. 20 రోజుల పాటు సాగే ఈ పర్యటనలో భాగంగా పార్డ్యూ యూనివర్సిటీలో అమలవుతున్న బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పురోగతిని అధ్యయనం చేయనుంది. తద్వారా ఆ వర్సిటీతో ఎంటర్‌ప్రైనర్‌షిప్ కొలాబరేషన్‌కు ప్రయత్నం సాగుతుంది. ఈ బృందంలో రుసా సీఈవో రాయల వంశీకృష్ణ, రుసా కో-ఆర్డినేటర్లు ప్రొఫెసర్ టి. రమాశ్రీ (ఈసీఈ విభాగం, ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ), ప్రొఫెసర్ వి. ఉషారెడ్డి (ఈఈఈ విభాగం, ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీ), ప్రొఫెసర్ ఎం.హేమ (వైరాలజీ విభాగం), ప్రొఫెసర్ కె.సుమకిరణ్ (ఇంగ్లీషు విభాగం), ప్రొఫెసర్ కె.వి.సుచరిత (హోం సైన్స్ విభాగం) ఉన్నారు. ఈ పర్యటన పూర్తయ్యాక అమెరికాలోని పార్డ్యూ యూనివర్సిటీ ప్రతినిధులు కూడా ఎస్వీయూనివర్సిటీని సందర్శించి, కొలాబరేషన్‌పై అధికారిక నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకోసం ప్రస్తుత పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది.

బంగారం విక్రయిస్తానంటూ బురిడీ

యువకుడి అరెస్టు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10: బంగారం విక్రయిస్తా నంటూ బురిడీ కొట్టించిన హేమచంద్రారెడ్డి(35) అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన హేమచంద్రారెడ్డి ఓ ప్రైవేటు సంస్థలో బంగారు ఆభరణాలను ఏడాది క్రితం తనఖా పెట్టాడు. వాటిని విడిపించి విక్రయించేందుకు తిరుపతికి చెందిన ప్రైవేటు సంస్థ నిర్వాహకులతో ఫోన్‌లో ఒప్పందం చేసుకున్నాడు. ఆ ప్రకారం వారి ద్వారా రెండు నెలల క్రితం రూ.2లక్షల నగదు తీసుకుని బంగారాన్ని విడిపించకుండానే పరారయ్యాడు. తిరుపతికి చెందిన ప్రైవేటు సంస్థకు చెందిన నిర్వాహకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అప్పటి నుంచి యువకుడు పరారీలో ఉన్నాడు. ఇటీవల మరో రెండు ప్రైవేటు సంస్థలను బంగారం విక్రయిస్తానని నమ్మించి నగదు తీసుకుని మోసం చేశాడు. బాధితులు శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు మంగళవారం హేమచంద్రారెడ్డి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మౌలిక వసతులు కల్పించండి

● కలెక్టర్‌కు పలువురు అర్జీదారుల వినతి

చిత్తూరు, సెప్టెంబరు 10: కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 112 మంది అర్జీదారులు వచ్చారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులకు వినతులను అందజేశారు. అధికంగా రెవెన్యూశాఖకు 96 వినతులు అందాయి. పోలీసు, డీపీవో, పశు సంవర్ధకశాఖ, పౌరసరఫరాలు, డీఎంహెచ్‌వో, నగరి మున్సిపాలిటీ, తదితర శాఖలకు 16 అందాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్ వినతిపత్రాలను స్వీకరిస్తూ అర్జీదారుల సమస్యలను ఓపిగ్గా విన్నారు. అప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, డిప్యూటీ కలెక్టర్ భవాని, డీఆర్‌డీఏ పీడీ తులసీ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని....

● వెదురుకుప్పం మండలంలోని ఎస్టీ కాలనీల్లో మౌళిక వసతులతో పాటు శ్మశానవాటికలకు స్థలాలను కేటాయించాలని యానాది సంఘం నేతలు, పలువురు గిరిజనులు కోరారు. ఎస్టీలు నివాసాలుండే కాలనీలకు సరైన రోడ్డు వసతి, సిమెంటు రోడ్డు, వాటర్‌ట్యాంకు సదుపాయాలు లేదన్నారు. సబ్సిడీ డ్రిప్ పరికాలను ఇవ్వాలని కొందరు రైతులు కోరారు.

● తనకు ప్రభుత్వం కేటాయించిన 3.20 ఎకరాల భూమిని సర్వే చేయించకుండా కొందరు అడ్డుకుంటున్నారని చౌడేపల్లె మండలం పొదలపలెకు చెందిన రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు.

● పశువుల మేత భూమిగా ఉపయోగించుకుంటున్న తమ భూములను కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని బంగారుపాళ్యం మండలం మొగిలి యానాదులు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 61లోని ఊరగుట్ట భూమిని తాము ఏళ్ల తరబడి పశువుల మేతభూమిగా, శ్మశానంతో పాటు మరికొంత భూమిని సాగు చేసుకుంటున్నామన్నారు. దొర చెరువుకు చెందిన ఓ వ్యక్తి రెవెన్యూ అధికారులను లోబరుచుకుని పట్టాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వీరు ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ ఫలసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న తమకు పట్టాలివ్వాలని కోరారు.

● వెదురుకుప్పం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోని తమ కాలనీకి సరైన రోడ్డు వసతి లేదని ఎస్టీకాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో 25 కుటుంబాల వరకు జీవనం సాగిస్తున్నామన్నారు. అనారోగ్యం పాలైతే 108 వాహనాలు రావడం లేదన్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే రోడ్డు వసతి కల్పించాలని కోరారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమత్‌కుమార్

పోలీసుశాఖకు 25 ఫిర్యాదులు

పోలీసు కార్యాలయంలో మంగళవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 25 మంది తమ సమస్యలను ఎస్పీ మణికంఠ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదులను విచారించి చర్యలు తీసుకుంటామని బాధితులకు ఎస్పీ హామీ ఇచ్చారు. భూ తగాదాల కింద 16, కుటుంబ తగాదాలు 03, డబ్బు తగాదాలు 02, దారి సమస్యలు 02, వేధింపులు 01 వంతున అర్జీలు అందాయి. డీఎస్పీ సాయినాథ్, అధికారులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంట

పండుగ కోసం వచ్చి..!

రోడ్డుప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి ● మరొకరికి తీవ్రగాయాలు



చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

గంగవరం, సెప్టెంబరు 10: వినాయక చవితి పండుగ కోసం వచ్చిన ఆర్మీజవాను రోడ్డుప్రమాదంలో మృత్యువాత పడ్డారు. ఈ ఘటన గంగవరం మండలంలోని మామడుగు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మండలం నడింకల్లాడు గ్రామానికి చెందిన బాలక్రిష్ణారెడ్డి కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి (21) ఏడాది క్రితం ఆర్మీజవానుగా ఉద్యోగంలో చేరారు. వినాయక చవితి పండుగ రావడంతో స్నేహితులు, కుటుంబసభ్యులతో కలసి సంతోషంగా గడపాలని సెలవు పెట్టి మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. స్నేహితులు, బంధువులతో సరదాగా గడిపారు. ఈ క్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి అమ్మమ్మ కర్ణాటక రాష్ట్రం నంగిలి సమీపంలోని గుమ్మకల్లు గ్రామంలో ఉండడంతో ఆమెను కలవడానికి గ్రామానికి చెందిన పూర్ణచంద్ర (25)తో కలసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. ఆమెతో మాట్లాడి ఇద్దరూ తిరుగు ప్రయాణమయ్యారు. గుమ్మకల్లు గ్రామం నుంచి పలమనేరు వైపు హైవేలో వస్తుండగా మామడుగు సమీపంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి వీరిని ఢీకొని వెళ్లిపోయింది. ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని అంబులెన్స్‌లో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే చంద్రశేఖర్‌రెడ్డి మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న పూర్ణచంద్రను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



వినోద్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

నగరి, సెప్టెంబరు10: నగరి మున్సిపాలిటీ పరిధిలోని నత్తం కండ్రిగకు చెందిన కానిస్టేబుల్ వినోద్‌కుమార్ (32) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన నింద్ర పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై నగరి వస్తుండగా మార్గమధ్యలో ఫ్రైడ్‌ఇన్ హోటల్ వద్ద ఎదురుగా వస్తున్న సిమెంటు లారీ ఓవర్‌టేక్ చేయబోయారు. ఈక్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో లారీ ఢీకొంది. దీంతో వినోద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈయన భార్య కళావతి ముడిపల్లి సచివాలయంలో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వినోద్‌కుమార్ మృతితో నెత్తంకండ్రిగ విషాదఛాయలు అలముకున్నాయి.

క్రైం కార్నర్

ద్విచక్రవాహనం బోల్తాపడి మహిళ మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నూరున్నీషా

పుంగనూరు రూరల్, సెప్టెంబరు10: పుంగనూరు బైపాస్‌రోడ్డులోని చౌడేపల్లె సర్కిల్లో ఉయ్యాలవాడ విగ్రహం వద్ద ద్విచక్రవాహనం బోల్తా పడి ఓ మహిళ మృతి చెందింది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన నూరున్నీషా(40) తన కుమారుడు బావాజాన్‌తో కలసి సోమవారం ద్విచక్ర వాహనంలో పలమనేరులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి సొంత గ్రామానికి వస్తుండగా ఉయ్యాలవాడ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్ వద్ద ఆమె అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్ఐ లోకేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. మహిళ అరెస్టు

గుడుపల్లె, సెప్టెంబరు 10: కర్ణాటక మద్యం తరలిస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. గుడుపల్లె మండల సరిహద్దులో ఉన్న కర్ణాటక మద్యం దుకాణాల నుంచి మండలంలోని బెల్టు షాపులకు మద్యం రవాణా సాగుతోందని పోలీసులకు సమాచారం ఉంది. ఈ క్రమంలో మంగళవారం పోలీసులు కుప్పం- పొగురుపల్లె రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. కుప్పిగానిపల్లెకు చెందిన రాజేశ్వరి ద్విచక్ర వాహనంలో కర్ణాటక నుంచి 190 ప్యాకెట్ల మద్యాన్ని తరలిస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. సంచిలోని మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.



కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసిన ఎస్ఈబీ పోలీసులు

కర్ణాటక మద్యం తరలింపు.. ఇద్దరి అరెస్ట్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు10: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పుంగనూరు ఎస్ఈబీ ఎస్ఐ హరికృష్ణ కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం రాజుపల్లె వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. పుంగనూరు మండలం కొత్తపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి(37), మర్రిమాకులపల్లెకుచెందిన హరినాథరెడ్డిలు బొలెరో వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యం, వాహనం స్వాధీనం చేసుకునానరు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వీఆర్‌కు తిరుమల టూ టౌన్ సీఐ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10: తిరుమల టూ టౌన్ సీఐగా మూడు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన మురళీమోహన్‌ను మళ్లీ వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్వీ యూనివర్శిటీ సీఐగా మురళీమోహన్ పనిచేశారు. తెలుగుయువత శ్రేణులు గత ఏడాది అప్పటి ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మను స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద దహనం చేశాయి.ఈ ఘటనపై యూనివర్శిటీ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.తెలుగు యువత నేతలు ఈ విషయాన్ని తాజాగా అమరావతి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వైసీపీకి సీఐ మురళీమోహన్ గతంలో ఏ విధంగా సహాయ సహకారాలందించారో వివరించారు.ఈ నేపథ్యంలో మురళీమోహన్‌ను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులొచ్చినట్లు సమాచారం.తిరుమల క్రైం సీఐగా పనిచేస్తున్న శేషగిరిని టూటౌన్‌కు ఇన్‌చార్జి సీఐగా నియమించారు.

హెల్మెట్ల వినియోగంపై తిరుమల ఘాట్‌లో తనిఖీలు

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు వినియోగిస్తున్నారా లేదా అనే అంశంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రమాదాల నివారణ కోసం టీటీడీ కొన్నేళ్లుగా ఘాట్‌రోడ్లలో హెల్మెట్ వినియోగం తప్పనిసరి నిబంధనను అమలుచేస్తున్న విషయం తెలిసిందే. అయితే తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రయాణించే తిరుమల స్థానికులు, వ్యాపారులు, ఉద్యోగులు అలిపిరి చెక్‌పాయింట్, జీఎన్సీ టోల్‌గేట్లతో తనిఖీల వరకే హెల్మెట్ పెట్టుకుని ఆ తర్వాత తొలగించి ప్రయాణిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ఆగస్టు 26న 'హెల్మెట్ ఏదీ గోవిందా..!' అనే శీర్షిక కథనం ప్రచురించింది. దీంతో తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్, ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ ఇప్పటికే పలుమార్లు తిరుమలలోని జీఎన్సీ, అలిపిరి చెక్‌పాయింట్ వద్ద ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే ఇప్పటికీ కొంతమంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను వినియోగించడం లేదనే సమాచారంతో ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ మంగళవారం మొదటి ఘాట్‌రోడ్డు మధ్యలోని హరిణి ప్రాంతంలో సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్లు పెట్టుకోకుండా ప్రయాణిస్తున్న వారిని నిలిపి అవగాహన కల్పించారు. ఇకపై తప్పనిసరిగా హెల్మెట్లు ధరిస్తామని, ఎట్టిపరిస్థితుల్లోనూ హెల్మెట్లు లేకుండా ప్రయాణించమని వారితో ప్రమాణం చేయించారు. మరోసారి హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



హెల్మెట్ల వినియోగంపై ప్రమాణం చేయిస్తున్న సీఐ

వేడుకగా ఆలయ శుద్ధి

● 16 నుంచి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబరు 10: తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 16 నుంచి మూడు రోజులపాటు వార్షిక పవిత్రోత్సవాలు జరగనున్నాయి. అందులో భాగంగా మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉద్యోగులు, అర్చకులు సుగంధ పరిమళ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర జలాలతో ఆలయంలో ప్రోక్షణ చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఇక ఈనెల 15న అంకురార్పణతో అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 16న పవిత్ర ప్రతిష్ఠ, 17న పవిత్ర సమర్పణ, 18న పూర్ణాహుతితో ఉత్సవాలు ముగియనున్నాయి. పవిత్రోత్సవాలు పురస్కరించుకుని పై నాలుగు రోజులు ఆర్జితసేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్వర్ణకుమార్‌రెడ్డి అనే భక్తుడు 11 పరదాలను కానుకగా అందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.



వైద్యవృత్తి ప్రగతికి ప్రతిబంధకంగా జీవో 85



పరమేశ్వరమంగళం పీహెచ్‌పీ ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన

పుత్తూరు/పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 10: వైద్య వృత్తి ప్రగతికి ప్రతిబంధకంగా వున్న జీవో 85ను వ్యతిరేకిస్తూ మంగళవారం పుత్తూరు మండలం లోని గొల్లపల్లి, పరమేశ్వరమంగళం పీహెచ్‌సీలోని వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధి కారి చైతన్య మాట్లాడుతూ కొవిడ్ సమయంలో జీవితాలను పణంగా పెట్టి గ్రామీణ ప్రాంతంలో వైద్యసేవలు అందించామని తెలిపారు. ఈ ఉత్తర్వు వల్ల తమ విలువైన మూడేళ్ల సర్వీసు నష్టం పోతామని, పీజీ సీట్లలో 30 నుంచి 15 శాతానికి కుదించడం వల్ల దాదాపు 2500 గ్రామీణ వైద్యులు ఉన్నత స్థాయి చదవులను కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. జీవోను రద్దు చేయకపోతే ఉద్యమాన్ని అంచెలవారీగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పీలేరులోని మూడిళ్లలో చోరీ

● రూ.2.50 లక్షల నగదు,
122 గ్రాముల బంగారు అపహరణ

పీలేరు, సెప్టెంబరు 10: పీలేరు పట్టణంలో దొంగలు ఏకంగా మూడు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. పీలేరు పట్టణంలోని శాంతి నగర్‌లో కేవీపల్లె మండలం గ్యారంపల్లెకు చెందిన డి.వెంకటరమణ వాటర్ ప్లాంటు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. మూడంస్తుల ఆయన భవనంలో ఆయనతోపాటు రెడ్డప్ప రెడ్డి, రెడ్డప్ప అనే వారు కాపురాలు ఉంటున్నారు. పీలేరుతోపాటు పరిసర ప్రాంతాల్లో సోమవారం వినాయక నిమజ్జనం ఉండడంతో వెంకటరమణ తమ కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామమైన గ్యారంపల్లెకు వెళ్లాడు. మొదటి అంతస్థులో ఉంటున్న రెడ్డప్ప రెడ్డి తల్లికి అనారోగ్యంగా ఉండడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి వెళ్లారు. రెండవ అంతస్థులో ఉన్న రెడ్డప్ప కూడా నిమజ్జనానికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దొంగలు వెంకటరమణ ఇంటి తలుపులు పగలగొట్టి ఇంటిలో ఉన్న రూ.1.50 లక్షల నగదు, 62 గ్రాముల బంగారు ఆభరణాలు, రెడ్డప్ప రెడ్డి ఇంటిలో రూ.80 వేల నగదు, 150 గ్రాముల బంగారు ఆభరణాలు, రెడ్డప్ప ఇంటిలో ఉన్న రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లిపోయారు. నిమజ్జన కార్యక్రమం ముగించుకుని సోమవారం రాత్రి 1 గంటకు ఇంటికి చేరిన వెంకటరమణ తమ ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి లోపలికెళ్లి చూడగా ఇంటిలో వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకున్నారు. అనుమానంతో మొదటి అంతస్థు, రెండ అంతస్తుకు వెళ్లి చూడగా అక్కడా ఇటువంటి దృశ్యాలే కనిపించాయి. దీంతో ఆయన మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించేందుకు నిపుణులను పిలిపించి కేసు విచారణ ప్రారంభించారు. ఒకే భవనంలోని మూడు అంతస్థుల్లో దొంగతనం జరగడం పీలేరులో చర్చనీయాంశం అయ్యింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి మరొకరికి గాయాలు


మృతులు నూర్జహాన్

రామసముద్రం, సెప్టెంబరు 10: రామసముద్రం మండలంలో మంగళవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాలలో ఒకరు మృతి చెందగా ఇంకొకరు తీవ్రంగా గాయపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. మండలంలోని చెంబకూరుకు చెందిన బాబు భార్య నూర్జహాన్ తన చిన్న కొడుకు బాబాజాన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పలమనేరు నుంచి మదనపల్లెకు వస్తుండగా పుంగనూరు బైపాస్ వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడడంతో నూర్జహాన్ తలకు బలమైన గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే దుర్మణం చెందింది. ఇదిలా ఉండగా మండలంలోని పెద్దకురప్పల్లెకు చెందిన రామకృష్ణ రామసముద్రం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తూ ఎదురుగా వస్తున్న ఇంకొక ద్విచక్రవాహనం ఢీకొనడంతో కాలికి తీవ్ర గాయమైంది. దీంతో అతన్ని మెరుగైన చికిత్స కోసం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పొలాల్లోకి దూసుకెళ్లి ఆటో బోల్తా తల్లీకూతురుకు తీవ్ర గాయాలు


రోడ్డు పక్కన పొలాల్లో బోల్తా పడిన ఆటో

ములకలచెరువు, సెప్టెంబరు 10: ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం సమీపంలో మంగళవారం ఓ ఆటో పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తల్లితో పాటు నాలుగేళ్ల కూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు...ములకలచెరువు మండలం దేవళచెరువు పంచాయతీ గోళ్లపల్లెకు చెందిన గౌతమి పనుల నిమిత్తం తన నాలుగేళ్ల కూతురు అంకితను పిలుచుకుని ములకలచెరువుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్ళేందుకు ఇద్దరూ ఆటో ఎక్కారు. ఈ క్రమంలో ఆటో పెద్దపాళ్యం సమీపంలోకి వచ్చే సరికి అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్ళి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గౌతమి(22), ఆమె కుమార్తె అంకిత(4)లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ఇద్దరిని చికిత్సల నిమిత్తం 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ములకలచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉచిత మోకాలి చికిత్సా శిబిరానికి విశేషస్పందన

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 10: స్థానిక రవీంద్రనగర్‌లోని లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లె అండ్ లయన్స్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత మోకాలి చికిత్స శిబిరానికి విశేషస్పందన లభించిందని మదనపల్లె లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అప్పినిపల్లె భాస్కరాచారి పేర్కొన్నారు. ఈ శిబిరంలో 22 మందికి డాక్టర్లు ఇంద్రపాల్ కసూరియా, భూపేంద్ర చౌదరి వైద్య చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు భాస్కరాచారి మాట్లాడుతూ మోకాలునొప్పులు, వెముక నొప్పి, సర్వైకల్ నొప్పికి చికిత్స అందించినట్లు తెలిపారు. వయో వృద్ధులకు ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడలు

రామాపురం, సెప్టెంబరు10: మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12, 13 తేదీల్లో మండల స్థాయి అండర్-14, అండర్ -17 క్రీడా పోటీలు నిరహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురా లు సుజాతమ్మ, మండల కోఆర్డినేటర్ పీడీ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. 12న యోగా, షటిల్, చెస్, అథ్లెటిక్స్, బడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయని, ఉదయం 9.30 గంటలకు క్రీడాకారులు హాజరుకావాలన్నారు. అండర్-14, అండర్ -17 పోటీల్లో బాలబాలికలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటా రన్నారు

ఆలోచిస్తే.. జీవితం ఆనందమయం

● ఆత్మహత్యకు పాల్పడడం హఠాత్పరిణామం కాదు ● సమస్యకు పరిష్కారం తోచని అయోమయ స్థితే కారణం
● కలికిరి జేఎన్‌టీయూలో ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినం సందర్భంగా మానసిక వైద్య నిపుణుల విశ్లేషణ

కలికిరి, సెప్టెంబర్లు 10: ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితం ఆనందమయంగా సాగుతుందని మానసిక వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఆత్మహత్యకు పాల్పడడం హఠాత్పరిణామం కాదని, సమస్యకు పరిష్కారం తోచకనే ఏర్పడే అయోమయ పరిస్థితులే ఇందుకు కారణమని వారన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినం సందర్భంగా మంగళవారం కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులతో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆత్మహత్యలకు పురిగొల్పే మానసిక దౌర్బల్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య ఆరోగ్య శాఖ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, మానసిక వైద్యులు, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉదయ్ కిరణ్, జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమ అధికారి డాక్టర్ శివప్రతాప్ నాయక్‌లు మాట్లాడుతూ ఆత్మహత్యలు ఎక్కువగా 15-20 సంవత్సరాల మధ్య వయసున్న వారు చేసుకుంటున్నారని, ఆ పై వయసుల వారు కూడా సమస్యలపై తగిన భరోసా లభించక నిర్లిప్తతకు గురవుతున్నారని చెప్పారు. సహనం, అవగాహన, భరోసాలతో ఆత్మహత్యలను నివారించవచ్చని తెలిపారు. రాను రాను ఆత్మహత్యల సంఖ్య పెరగడం ఆందోళన కలిగించే అంశమన్నారు. పిరికివారే ఆత్మహత్యకు పాల్పడుతారనేది వాస్తవం కాదని, ఆలోచనా విధానాల్లో మార్పులు, మానసిక వత్తిడులు, ఆసరా లభించకపోవడం ప్రధాన కారణాలుగా వివరించారు. సాధారణంగా కడుపు నొప్పితో ఆత హత్య చేసుకున్నారనడం నిరాధారమైందన్నారు. ఎప్పటి నుంచో పేరుకు పోయిన వ్యతిరేక భావాలు, వాటి ప్రభావాలు అన్నీ కలగలిసి ఆత్మహత్య కు పురిగొలుపుతాయని విశదీకరించారు. ఒకసారి ఆత్మహత్యా యత్నం చేసి బతికిన వారు తరువాత సాధారణ జీవితానికి అలవాటు పడతారని గుర్తించాలని చెప్పారు. మనతో తరచూ ఆత్మహత్య ఆలోచనల గురించి సంకేతాలను పంచుకునే వారు రెండు మూడు వారాల్లోపు తప్పనిసరిగా బలవన్మరణానికి గురవుతారన్నారు. కౌన్సెలింగ్ నైపుణ్యాలు లేకపోయినా నిరాశలో కూరుకుపోయిన వారికి భరోసా కల్పించవచ్చని చెప్పారు. మానసిక వ్యాధుల సమాచారం, సలహాల కోసం టోల్ ఫ్రీ నంబరు 14416తో టెలీ మానస్‌కు ఫోన్ చేసి ఉపశమనం పొందొచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ అపర్ణ, హెల్త్ ఎడ్యుకే టర్ మహ్మద్‌రఫీ, ఎస్టీఎస్ నాగిరెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.


వాల్మీకిపురం గురుకుల పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్

క్షణికావేశంతో జీవితాలను నాశనం చేసుకోరాదు

వాల్మీకిపురం, సెప్టెంబరు 10:క్షణికావేశంతో జీవితాలను నాశనం చేసుకోరాదని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వాల్మీకిపురం అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో మనిషి క్షణికావేశానికి లోనై ప్రాణాలు తీసుకుంటున్నారని, గెలవడం ధ్యేయం కావాలే తప్ప ప్రతి ప్రయత్నం గెలుపే కావాలని ఎక్కడా లేదన్నారు. ఈ విషయంలో ప్రతి మనిషి కూడా ప్రశాంతంగా ఆలోచిస్తే జీవితం విలువ ఎంటో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, వైస్ ప్రిన్సిపాల్ రామలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, సలోని, కృష్ణవేణి, సింధు, ధనలక్ష్మి, శోభన, గౌతమి, రేఖ, సత్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

సేవారత్న అవార్డుకు అబూబక్కర్ సిద్ధిక్ ఎంపిక

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 10: హెల్పింగ్ మైండ్స్ ద్వారా విశిష్ట సేవలను అందించిన అబూబక్కర్ సిద్ధిక్ భారత సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. మదనపల్లె కేంద్రంగా ఫుడ్ బ్యాంక్, సానిటరీ ప్యాడ్ బ్యాంక్, ఉచిత బాడీ ఫ్రీజర్ బాక్స్, క్యాన్సర్ బాధితులకు ఉచితంగా విగ్గులు, ఉచితర రక్త వర్గీకరణ, అనాథ మృతులకు దహన సంస్కారాలు, కరోనా విపత్తు పరిస్థితుల్లో సేవలు, కరోనా మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడం లాంటి సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 14న ప్రముఖుల చేతుల మీదుగా బెంగళూరులో నిర్వహించే జాతీయ అవార్డుల ప్రధానోత్సవంలో సోమలరాజు ఫౌండేషన్ వారి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో కోర్టులో గంగమ్మ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు10: కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుష్మిత్ స్వామి అమ్మవారిని ఉదయాన్నే సుప్రభాత సేవతో మేల్కొల్పి ఆలయం అంతా వేపమండలతో పూలతో ప్రత్యేకంగా శోభాయమానంగా అలంకరణలు చేసి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు ట్రెజరర్లు రాటకొండ రంగస్వామి నాయుడు, కరుణాకర్ నాయుడు, మార్పూరి విక్కీ, మార్పూరి మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులు నాయుడు పర్యవేక్షించారు.

వైభవంగా వినాయక నిమజ్జనం


నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు

కలికిరి, సెప్టెంబర్లు 10: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెండవ రోజు కూడా కలికిరిలో గణపతి విగ్రహాల నిమజ్జనం వైభవంగా జరిగింది. అనివార్య కారణాలతో సోమవారం నిమజ్జనం చేయలేని వారు రెండో రోజు ఈ కార్యక్రమం పూర్తి చేశారు. బళ్ళారి డ్రమ్ములు, బాణా సంచాతో విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. కలికిరి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

'విద్యారంగానికి నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం'

రాయచోటిటౌన్, సెప్టెంబరు 10: విద్యారంగానికి నిధుల కేటాయింపులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వర రావు ఆరోపించారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో రాజంపేట పట్టణంలో జరగనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య అన్నమయ్య జిల్లా నిర్మాణ మహాసభల కరపత్రాలను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి కోటేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్‌లో పదిశాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు విడుదల చేయాలని కోరారు. విభజన హామీల్లో భాగంగా అనంతపురం జిల్లా సెంట్రల్ యూనివర్సిటీ, కడప ఉక్కు పరిశ్రమ, పెట్రోలియం యూనివర్సిటీలకు నిధులు కేటాయించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు లోకేశ్, రఘుపతి, వంశీ, నారాయణ, శ్రీకాంత్, ధనకుమార్, రెడ్డికుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

డిప్యుటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులు వద్దంటూ నిరసన


స్కూల్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 10: స్థానిక ప్రాథమిక పాఠశాలకు డిప్యుటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులు వద్దని, ముందున్న ఉపాధ్యాయులనే కొనసాగించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యుటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులను కొనసాగిస్తే మా పిల్లలను మరొక పాఠశాలకు వెళ్లిపోతారని హెచ్చరించారు. ముందున్న ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన తరువాతనే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని వారు పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యాభ్యాసం మంచిగా ఉందని కితాబు ఇచ్చారు. వారిని కాదని వేరే ఉపాధ్యాయులు స్కూల్‌కు వస్తే పాఠశాలకు తాళాలు వేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించండి

కలకడ, సెప్టెంబరు 10:మండలంలోని ముడియంవారిపల్లె యూపీ పాఠశాలకు అదనంగా మరో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యా ప్రమాణాలు సరిగాలేవన్నారు. ఈ పాఠశాల్లో నలుగురు ఉపాధ్యాయులు ఉండాల్సిఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారని దీంతో ఉపాధ్యాయుల కొరత కారణంగా పిల్లలు చదువు కుంటుపడుతోందన్నారు. అదనంగా ఉపాధ్యాయులను నియమించకుంటే తమ పిల్లల టీసీ ఇచ్చేయాలంటూ పాఠశాల గేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయుల కొరత తీరేంతవరకు తమ పిల్లలను పాఠశాలకు పంపమన్నారు. ఉన్నతాధికారులు కల్పించుకుని సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మార్కెట్ యార్డ్‌లో అవినీతిపై విచారణ చేయాలి


కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం ఇస్తున్న వంగిమళ్ల రంగారెడ్డి.

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 10: కలికిరి మార్కెట్ యార్డులో సిబ్బంది అవినీతిపై విచారణ జరిపించాలని సీపీఐ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు సీపీఐ రైతు సంఘం నాయకులు వంగిమళ్ల రంగారెడ్డి, వెంకటేష్ మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవనాల అద్దెలను రెన్యువల్ చేసినప్పుడు షాపు యాజమానుల దగ్గర అక్రమంగా వసూళ్ల చేస్తున్నారన్నారు. రైతు నుంచి కేవలం 2 శాతం కమీషన్ వసూలు చేయాలని నిబంధనలు ఉన్నా 15 నుంచి 20 శాతం వసూలు చేస్తున్నారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ విషయాలపై ఉన్నతాధికారులు పూర్తిగా విచారించి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

జీవో 85కు వ్యతిరేకంగా ప్రభుత్వ వైద్యుల ఆందోళన

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 10: జీవో 85కు వ్యతిరేకంగా పీహెచ్‌సీల్లోని వైద్యులు మంగళ వారం నల్లరిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేశారు. పదో తేదీ నుంచి ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ జీవో ద్వారా తమ మూడేళ్ల సర్వీసు అర్థంలేకుండా పోతుందని, దీంతో తమ ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని వాపోయా రు. గత రెండు నెలలుగా జీవో 85 రద్దు చేయమని అధికారులకు, శాసనసభ్యులకు అర్జీ లు సమర్పించినా ఇప్పటివరకు ఎటువంటి స మాధానం రాలేదని వైద్యులు నిరాశ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గురు మహేష్, డాక్టర్ దీప, సీహెచ్‌వో నాగేష్ పాల్గొన్నారు.

సుండుపల్లె: జీవో నెంబర్ 25కి వ్యతిరేకంగా సుండుపల్లె మండలంలోని రాయవరం ప్రాథమి క వైద్య కేంద్రంలో ఉన్న వైద్యులు నిరసన తెలియ జేశారు. మంగళవారం ప్రాథమిక వైద్య కేంద్రం ఆవరణంలో నల్ల బ్యాడ్జీలతో తమ నిరస నను తెలి యజేశారు. ఈ జీవో ద్వారా తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోతుందని ఇలా ఆకస్మాత్తుగా జీవో మార్చడం అన్యాయమ న్నారు.

భూసార పరీక్షలతో తక్కువ ఖర్చు.. అధిక దిగుబడులు

రామాపురం, సెప్టెంబరు 10: మారుతు న్న వాతావరణ పరిస్థితులకు అనుగుణం గా ఉత్తమ వ్యవసాయ పద్ధతులు ఆచ రించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని అన్నమ య్యా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్ తెలిపారు. మంగళవారం గోప గుడిపల్లె పంచాయతీ గొల్లపల్లిలో పొలం బడి కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధి కారి నాగమణి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


పౌష్టికాహార మాసోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏసీడీపీవో, సిబ్బంది

సుండుపల్లె, సెప్టెంబరు10: అంగన్వాడీల సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఏసీడీపీ సుగుణమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలకు తగిన సూచనలు, సలహాలను అందజేశారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాల న్నారు. వరకట్నం తీసుకోవడం నేరమని అలా ఎవరైనా తీసుకున్నా, మహిళలను వేధించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ అంజుమ్, సూపర్‌వైజర్ వనజమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సర్వే పనుల ఆలస్యంపై అధికారుల విచారణ

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 10: మదనపల్లె మండలంలో సర్వే పనులు సక్రమంగా జరగడం లేదని ఆలస్యమవుతున్నాయన్న ఫిర్యాదుపై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. పెద్ద సర్వేయర్ చెప్పందే సచివాలయాల్లో సర్వే చలాన్లు కట్టించుకోలేదని మాలమహానాడు నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడంతో మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణలు వేర్వేరుగా విచారణ చేపట్టారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ప్రకారం గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పాటు, మీ సేవాలో చలానాలు కట్టించుకునే సిబ్బంది, రైతులకు ఫోన్లు చేసి విచారించారు. ఇందులో ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను అడిగి తెలుసుకుని రాత్రి 11.30 గంటల వరకు విచారించారు. దీనిపై డీఐలు విచారణలో తేలిన అంశాలను నివేదిక రాసి జిల్లా సర్వే ఏడీకి పంపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏడీ ఫోన్‌లో మాట్లాడుతూ డీఐల నుంచి రిపోర్టు వచ్చిందని, ఈ రిపోర్టును పరిశీలించి మదనపల్లె మండలంలో సర్వే పనుల ఆలస్యం, ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు, డీఐల విచారణలో తేలిన నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు పంపుతామన్నారు.

వలసపల్లెలో ఆక్రమణల తొలగింపు


ప్రభుత్వ స్థలంలో నిర్మించిన పునాదులను తొలగించిన దృశ్యం

మదనపల్లె మండలం వలసపల్లెలో మంగళవారం ఆక్రమణలను అధికారులు తొలగించారు. నవోదయకాలనీలో ప్రభుత్వ ఉద్యోగులు ఇళ్ల స్థలాలు కేటాయించారని గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం హౌసింగ్ ఏఈ దీనదయాళ్, వీఆర్‌వో శ్రీనివాసులు అక్కడికి వెళ్లి విచారించారు. హౌసింగ్ ఇంటి స్థలం కేటాయించిన వ్యక్తి, పక్కనే ఉన్న మరో వృద్ధురాలి నుంచి ఇంటి స్థలం కొనుగోలు చేసిన అంశంపై విచారించారు. దీంతో పాటు ఈ రెండు స్థలాల పక్కన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పునాదులు వేసి ఉండటంతో ఎక్స్‌కవేటర్ తీసుకొచ్చి అక్రమ పునాదులను తొలగించారు. వీఆర్‌వో శ్రీనివాసులు మాట్లాడుతూ నవోదయ కాలనీలో 2019-20 సంవత్సరాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించారని, వారిలో అనర్హులు ఎక్కువగా ఉన్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయన్నారు. దీనిపై సమగ్రంగా విచారించి ఆర్‌ఐ, తహసీల్దార్‌కు వివరిస్తామన్నారు.

కాంట్రాక్టు నర్సుల సమస్యలు పరిష్కరించాలి


ప్రభుత్వాస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నర్సులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 10: కాంట్రాక్టు నర్సులుగా గత పదకొండేళ్లుగా పనిచేస్తున్న తమ సమస్యలు తక్షణం పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే జీవో నెంబర్ 115తో అన్యాయం జరుగుతోందని, వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నర్సులు ధర్నా నిర్వహించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రి ఎదుట కాంట్రాక్టు నర్సులు నిరసన తెలిపి మాట్లాడుతూ 11 ఏళ్లుగా రెగ్యులర్ నోటిఫికేషన్లు ఇవ్వలేదన్నారు. అప్పటి నుంచి కాంట్రాక్టు పద్ధతిలోనే పనిచేస్తున్నామన్నారు. మూడు రోజుల క్రితం విడుదల చేసిన జీవో ప్రకారం ఏఎన్‌ఎం పోస్టులను సృష్టించి వారికి రెగ్యులర్ పోస్టులు ఇస్తున్నారని, దీని వలన తమ ఉద్యోగాలకు భద్రత ఉండదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సులు సుహాసిని, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకుందాం


విశాఖ ఉక్కును కాపాడాలంటూ నిరసన తెలియజేస్తున్న ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మికులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకుందాం, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నీరుగట్టువారిపల్లె వ్యవసాయ మార్కెట్ వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు తోపు కృష్ణప్ప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను విక్రయించలనే ఉద్దేశ్యం మానుకోవాలని హితవు పలికారు. ఆంధ్రాలో ఉన్న ఒకేఒక భారీ పరిశ్రమ అని వెయ్యి రోజులపైగా విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం మదనపల్లెలో పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్రమం చేపట్టామన్నారు. విశాక ఉక్కు పరిశ్రమపై ఆధారపడి ప్రత్యక్షంగా 20 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, ముభారక్, నాయకులు రెడ్డెప్ప, వ్యవసాయ కార్మిక సంఘం కన్వీనర్ చంద్రశేఖర్, మెకానిక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బి.కొత్తకోటలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

బి.కొత్తకోటలో: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసేయత్నాన్ని విరమించుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకోవాలంటూ బి.కొత్తకోట జ్యోతి చౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు .ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, తంబళ్లపల్లె నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డిలు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్రత్యేకంగా గనులు ఏర్పాటు చేయాలని, ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని, లేని పక్షంలో విద్యార్థి యువజన, కార్మిక సంఘాలతో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బషీర్‌ఖాన్. రఘునాథ్, అష్రఫ్‌అలీ, తంబయ్యశెట్టి, జవహర్‌బాబు, గంగాధర్, బాబు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలం పొడిగింపు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 10: మదనపల్లె టౌన్ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలం పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర సహకార, రిజిస్ట్రేషన్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటి పరిధిలోకి వచ్చే మదనపల్లె టౌన్ బ్యాంకు ఇది వరకు పర్సన్ ఇన్‌చార్జి పాలనలో ఉంది. ఈ క్రమంలో ఈ గడువును డిసెంబర్ 20వ తేదీ వరకు, లేదా టౌన్ బ్యాంకు పాలక వర్గం ఎన్నికలు జరిగే వరకు ఏది ముందు వస్తే ఆ తేది వరకు పర్సన్ ఇన్‌చార్జియే పాలన సాగించాలని ఉత్తర్వుల సారాంశం. ఈ క్రమంలో డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్ సి. గురుప్రకాష్ రావు పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవరించనున్నారు.

ట్రాక్టర్ బోల్తా ప్రమాద బాధితులకు పరామర్శ


జిల్లా ఆసుపత్రిలో ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న టీడీపీనేత జయచంద్రారెడ్డి

పెద్దమండ్యం, సెప్టెంబరు 10: మదనపల్లి జిల్లా ప్రభుత్వాసు పత్రిలో చికిత్స పొందుతున్న గుడిసెవారిపల్లి ట్రాక్టర్ బోల్తాపడి గాయపడిన బాధితులను తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి మంగళవారం పరామర్శించారు. పెద్దమండ్యం మండలం పాపేపల్లి గ్రామ పంచాయతీ గుడిసెవారిపల్లి వినాయక నిమజ్జనం అనంతరం ట్రాక్టర్ ట్రాలీలో కూర్చొని సోమవారం రాత్రి చెరువులో ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో అఫ్జల్ అనే 6వ తరగతి విద్యార్థి మృతి చెందగా పలువురు గాయపడిన విషయం తెలిసిందే. గాయపడిన పలువురు బాధితులు మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుకున్న జయచంద్రారెడ్డి ఆసుపత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు, గాయపడిన బాధితులకు ఆర్థిక సహాయం అందచేసినట్లు తెలిపారు. మదనపల్లి ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల చికిత్స ఖర్చులు చెల్లిస్తానని జయచంద్రారెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సీడ్ మల్లికార్జున, గిరిధర్‌రెడ్డి, తులసీధర్‌నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, కుంటకింద చంద్రారెడ్డి, విశ్వనాథరె డ్డి, శంకర్‌రెడ్డి, గల్లానారాయణ, నగేష్‌రెడ్డి, సీతాపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించండి

ములకలచెరువు, సెప్టెంబరు 10: వినాయక నిమజ్జనాల సందర్భంగా జాగ్రత్తలు పాటించాలని ములకలచెరువు ఎస్ఐ గాయత్రి పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి వినాయకుడి విగ్రహాలు తీసుకెళ్లే సమయంలో డ్రైవర్లు మద్యం తాగి ట్రాక్టర్లు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న పిల్లలను ట్రాక్టర్లలో ఎక్కించుకోరాదన్నారు. నిమజ్జనాల సందర్భంగా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.